రిజర్వుడు బోగీల్లోకి జనరల్ టిక్కెట్ ప్రయాణికులు

● టార్గెట్ల కోసం ఫైన్లు రాసి పట్టించుకోని టీసీలు ● ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని ఆర్‌పీఎఫ్ సిబ్బంది ● ఇబ్బందులు పడుతున్న కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్యాసింజర్లు

కృత్రిమ మేధతో వ్యవసాయ రంగంలో కొత్త విప్లవం

● ఎన్జీ రంగా రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ

6లో..

పైకొచ్చిన.. పాతాళగంగ

గణనీయంగా పెరిగిన భూగర్భ జలాలు

● అందుబాటులో 66.1 టీఎంసీల నీరు

● వ్యవసాయ బోర్లకు తీరిన నీటి కొరత

● పల్నాడు జిల్లాలో అత్యధికం

కురిసిన మేఘం.. ఊటెక్కిన భూమి!



నకరికల్లు వద్ద బోర్లతో పాలాలకు నీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూగర్భ జల కొరత దాదాపు తీరింది. వేసవికి కొన్ని ప్రాంతాల్లో 37 మీటర్ల లోతుకు జలాలు పడిపోతుండేవి. దీంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయం విదితమే. ప్రస్తుతం అడుగంటిన వందలాది బోర్లకు మళ్లీ జలకళ సంతరించుకుంది. పల్నాడు జిల్లాలో ప్రధానంగా బొల్లాపల్లి, వెల్దుర్తి, మాచర్ల, దుర్గి మండలాల్లో వేసవిలో ప్రమాదకర స్థాయిలో భూగర్భ జలాలు పడిపోయాయి. ఈ ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం భూగర్భ జలమట్టం పెరిగింది. వేసవిలో జిల్లా సగటు భూనీటి మట్టం 11.08 మీటర్లు కాగా ప్రస్తుతం 8.46 మీటర్లకు జలాలు పెరిగాయి. సగటున 2.66 మీటర్ల మేర నీరు పైకొచ్చింది. దుర్గి మండలంలో 7.49 మీటర్లు, వెల్దుర్తిలో 7.43 మీటర్లు, యడ్లపాడులో 6.65 మీటర్లు, అత్యంత నీటి ఎద్దడి మండలమైన బొల్లాపల్లిలో 4.20 మీటర్ల మేర భూనీటి మట్టం పెరిగింది. మూడు మీటర్ల లోపు లోతులో భూగర్భ జలాలు జిల్లాలోని 38.95 శాతం ప్రాంతంలో లభిస్తున్నాయి. 28.42 శాతం ప్రాంతంలో మూడు నుంచి ఎనిమిది మీటర్లలో.. ఎనిమిది నుంచి 20 మీటర్ల లోతులో 23.16 శాతం.. 20 మీటర్ల కన్నా ఎక్కువ లోతులో 9.47 శాతం.. ఉన్నట్టు భూగర్భ జలాల శాఖ వెల్లడించింది.

వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. కాలువలకు పుష్కలంగా నీటి పరఫరా జరుగుతోంది. చెరువులు, కుంటలు నిండాయి. భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులకు జలకళ సంతరించుకుంది. ఎక్కడ చూసినా నీటి నిల్వలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. దీంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. వ్యవసాయ బోర్ల ద్వారా సమృద్ధిగా పంటలకు నీరు అందుతోంది. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలా లు 1.25 నుంచి 3 మీటర్ల లోతులోనే అం దుబాటులో ఉన్నాయి. 66.1 టీఎంసీ ల నీరు అందుబాటులోకి వచ్చింది.

జిల్లాల వారీగా భూగర్భజల మట్టం

పల్నాడు సాధారణ వర్షపాతం 535.5 మి. మీ కాగా 560.6 మి.మీ వర్షపాతం నమో దైంది. ఈ జిల్లాలో 35.90 టీఎంసీల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి.

బాపట్ల జిల్లా వేసవిలో సగటు భూ గర్భ నీటి మట్టం 3.93 మీటర్లు కాగా.. ప్రస్తుతం 2.96 మీటర్లకు చేరింది. 0.96 మీటర్ల నీటి మట్టం పెరిగింది. జిల్లా అంతటా నీటి మట్టం పెరగగా అద్దంకి, చినగంజాం, మార్టూరు నీటి మట్టం పెరగలేదు. మూడు మీటర్ల లోపు భూ నీటి మట్టం 65.31 శాతం.. మూడు నుంచి ఎనిమిది మీటర్ల లోపు 32.65 శాతం.. ఎనిమిది నుంచి 20 మీటర్లలోపు 2.04 శాతం ప్రాంతంలో నీరు ఉంది. కొల్లూరు మండలంలో 3.94 మీటర్లు, వేమూరులో 3.04 మీటర్ల మేర నీటి మట్టం పెరిగింది. బాపట్ల జిల్లా సాధా రణ వర్షపాతం 554.2 మి.మీ కాగా 514.6 మి.మీ నమోదైంది. జిల్లాలో 14.50 టీఎంసీల నీటి నిల్వలు అందు బాటులోకి వచ్చాయి.

గుంటూరు జిల్లాలో వర్షాలు దంచి కొట్టాయి. దీంతో భూగర్భ నీటి మట్టం కూడా 3.69 మీటర్ల మేర పెరిగింది. వేసవిలో జిల్లా సగటు నీటి మట్టం 5.37 మీటర్లు కాగా 1.68 మీటర్లకు పెరిగింది. 81.08 శాతం మూడు మీటర్ల లోతులోనే నీరు ఉంది. 18.92 శాతం మూడు నుంచి 8 మీటర్ల లోపు నీరు లభిస్తోంది. చేబ్రోలు మండలంలో 7.16 మీటర్లు.. గుంటూరులో 5.38 మీటర్లు, కొల్లిపరలో 4.70 మీటర్లు, పెదకాకాని మండలంలో 4.07 మీటర్ల మేర నీటి మట్టం పెరిగింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 614.7 మి.మీ కాగా 825.5 మి.మీ నమోదైంది. జిల్లాలో 15.70 టీఎంసీల నీటి నిల్వ అందుబాటులోకి వచ్చింది.



విద్యానగర్ మెయిన్ రోడ్డులో వర్షపు నీరు

కుండపోత

● తటాకాల్లా ప్రధాన రహదారులు ● ఇక్కట్లు పడ్డ వాహన దారులు

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండలు భగ్గుమంటుండగా ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కుంభవృష్టిలా కురిసిన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి 7 గంటల తరువాత మొదలైన వాన అర్ధరాత్రి వరకు కుండపోతగా కొనసాగింది. దీంతో నగరంలోని డ్రెయిన్లన్నీ రోడ్లపైకి ఉప్పొంగాయి. డొంకరోడ్డు, కంకరగుంట అండర్ పాస్‌లోకి వర్షపు నీరు చేరడంతో.. ఆయా మార్గాల్లో రెండు మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మరో వైపు డ్రెయిన్లలోని మురుగునీటితో రోడ్లు చిన్నపాటి చెరువులను తలపించాయి. రింగు రోడ్డు, స్తంభాలగరువు, బ్రాడీపేట, అరండల్‌పేట లక్ష్మీపురం, జీఎన్‌టీ రోడ్డు, పాత గుంటూరులో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అపార్టుమెంట్ల సెల్లార్లలోకి వర్షపు నీరు చేరి వాహనాలను నీట ముంచింది.

వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

సాయంత్రం వివిధ కార్యాలయాలు, సంస్థల నుంచి ఉద్యోగులు ఇళ్లకు చేరుకునే సమయంలో వర్షం పడటంతో ఎక్కడివారు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. రాత్రి పది గంటలకు కూడా వర్షం వదలకపోవటంతో ఇళ్లకు చేరుకోవాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక రహదారులు వర్షపునీటితో చెరువుల్లా మారాయి. వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. ముఖ్యంగా మూడు వంతెనల వద్ద, కంకరగుంట ఆర్‌యూబీల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం తగ్గుముఖం పట్టాక ప్రజలు కంకరగుంట ఓవర్ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ బ్రిడ్జిపైనా రాకపోకలు స్తంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



అరండల్‌పేటలో..



కొరిటెపాడు మెయిన్ రోడ్డు..



లక్ష్మీపురం మెయిన్ రోడ్డు..



అరండల్‌పేట మెయిన్ రోడ్డు..



బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు..



బ్రాడీపేట ఒకటో లైనులో ..

40 శాతం ప్రకృతి వ్యవసాయ విస్తరణే లక్ష్యం

ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్

గుంటూరు సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతం అయ్యేందుకు ప్రభుత్వ అంకితభావమే ప్రధాన కారణమని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ పేర్కొన్నారు. రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రంలో 40 శాతం ప్రకృతి వ్యవసాయం విస్తరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బ్రెజిల్ ప్రతినిధులతో సోమవారం గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రెండు రోజులుగా తూర్పు గోదావరి జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన బ్రెజిల్, యూఏఈ, శ్రీలంక దేశాలకు చెందిన 30 మంది ప్రతినిధులు తమ అనుభవాలు, పరిశీలించిన అంశాలను ఈ సమావేశంలో పంచుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో వస్తున్న సానుకూల మార్పు, ముఖ్యంగా మహిళలు పోషిస్తున్న క్రియాశీలక పాత్రను బృంద సభ్యులు ప్రత్యేకంగా ప్రశంసించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు, ప్రజా భాగస్వామ్యం, అంతర్జాతీయ పర్యటనలు సుస్థిర వ్యవసాయం బలోపేతంలో కీలక అంశాలని స్పష్టం చేశారు. బ్రెజిల్ వ్యవసాయ అభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన వివియన్ లిబోరియో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయంలో చేస్తున్న అగ్రో ఎకాలజీ ప్రయత్నాలు బ్రెజిల్‌లో కుటుంబ వ్యవసాయం, సహకార వ్యవస్థలు, రసాయన వినియోగం తగ్గించే చర్యలతో సమాన దిశలో సాగుతున్నాయన్నారు. "నౌ" పార్టనర్స్ వ్యవస్థాపకుడు వాల్టర్ లింక్, బ్రెజిల్ బృంద సభ్యులు జోయిస్ రెండు రోజుల క్షేత్ర పర్యటనలో మట్టి ఆరోగ్యం, సూక్ష్మజీవ శాస్త్రం, బయో స్టిమ్యులెంట్లు, సంవత్సరం పొడవునా భూమి రక్షణ పంటలు, తొమ్మిది ప్రకృతి వ్యవసాయ సూత్రాల అనుసంధానంపై నేర్చుకున్న పాఠాలను వివరించారు. అమెజాన్‌కు చెందిన మారియో బ్రాగా డి గోస్ వాస్కోన్సెలోస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వివిధ పర్యావరణ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ నమూనాను అనుసరించేందుకు ఇది ఒక మార్గదర్శకంగా నిలిచిందన్నారు. సుస్థిర, పునరుత్పత్తి వ్యవసాయంలో రాష్ట్ర నాయకత్వాన్ని మరొకసారి నిర్ధారించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ, ఇంటర్నేషనల్ కో- ఆప రేషన్ ఇన్‌చార్జి స్వాతి,సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుడితి రాజశేఖర్

హరితహితమైన గుంటూరు జిల్లాకు కృషి

కలెక్టర్ అన్సారియా ● ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవం

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన - హరితహితమైన గుంటూరు జిల్లాను ఆవిష్కృతం చేద్దామని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవం సోమవారం నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా జరిగింది. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు 5 రాష్ట్ర, 48 జిల్లాస్థాయి స్వచ్ఛఆంధ్ర అవార్డులు వచ్చాయని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రోత్సాహక అవార్డులు - 2025కు.. స్వచ్ఛత కార్యకలాపాలపై చేసిన ప్రశంసనీయ కృషిని గుర్తించడానికి ప్రభుత్వం అవార్డులను ప్రకటించిందన్నారు. వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఆర్‌ఆర్‌ఆర్ (తగ్గించటం, మళ్లీ ఉపయోగించడం, రీసైక్లింగ్), సుస్థిర పద్ధతుల్లో కొత్త ప్రమాణాలను నిర్ణయించడం తదితర అంశాలలో అవార్డు గ్రహీతలు పని చేయడం జరిగిందన్నారు. అవార్డులను మొత్తం 17 కేటగిరీలలో ప్రభుత్వం ప్రకటించిదన్నారు. ప్రతి మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో ఒక ఉద్యమంలాగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర - ఆరోగ్య ఆంధ్రలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం గొప్ప విషయం అన్నారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా 36 లక్షల మరుగుదొడ్లు నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనన్నారు. జీవన ప్రమాణాలు పెరగాలని ఆయన గొప్ప ఆలోచన చేశారని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవ గొప్పదన్నారు. కోవిడ్ సమయంలో సైతం పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు అపురూపమన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డులు

స్వచ్ఛ మున్సిపాలిటీలలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు ప్రత్యేక కేటగిరి), మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(లక్ష నుంచి 3 లక్షల జనాభా కేటగిరి), స్వచ్ఛ గ్రామ సంఘం కేటగిరిలో పొన్నూరు మండలం ములుకుదురు గ్రామం, స్వచ్ఛ అంగన్వాడి కేంద్రాల్లో జొన్నలగడ్డ మెయిన్ అంగన్వాడీ, స్వచ్ఛ రైతు బజార్ కేటగిరిలో చుట్టుగుంట రైతు బజార్‌కు రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయని కలెక్టర్ తెలిపారు.

ఇక జిల్లా స్థాయిలో స్వచ్ఛ మున్సిపాలిటీ విభాగంలో పొన్నూరు మున్సిపాలిటీ సహా 48 అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సభ్యురాలు ఆరుద్ర భూలక్ష్మి, గౌడ కార్పొరేషన్ సభ్యురాలు లక్ష్మీ శైలజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్డీఓ శ్రీనివాసరావు, డీపీఓ బీవీ నాగ సాయి కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు గాదె వెంకటేశ్వరరావు, చెరుకూరి తిరుపతిరావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తోన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

శ్యామలానగర్ ట్రాఫిక్ కష్టాలు.. తీర్చేదెవరు

● రోడ్ల మీదే తినుబండారాలు, కూరగాయల షాపులు

● రోడ్లకిరువైపులా వాహనాల పార్కింగ్



మిలటరీ క్యాంటిన్ సమీపంలో ట్రాఫిక్ జామ్

గుంటూరు (తూర్పు) అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్యామలానగర్‌లో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి .ముఖ్యంగా ఆర్మీ రిక్రూట్మెంట్ కార్యాలయం వద్ద ఉన్న యూటర్న్ వద్ద ఈ సమస్య ఏర్పడు తుంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శ్యామలనగర్ రైల్వేగేట్ వైపు వెళ్లే వాహనాలు.. శ్యామల నగర్ కు వచ్చే వాహనాలతో ఆ ప్రాంతం లో వాహనాలు నిలిచి పోతున్నాయి. రైలు గేటు తెరిచినప్పుడు ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటోంది. అంతే కాకుండా రోడ్ల వెంబడి తినబండారాల బళ్ళు, కూరగాయల బళ్ళు నిలిపి వ్యాపారాలు చేయడంతో, కొనుగోలు దారులు రోడ్ల వెంబడే వాహనాలు పార్కింగ్ చేయడంతో, సమస్య మరింత తీవ్రమవుతోంది. అంతే కాకుండా సాయంత్రం పూట విద్యా సంస్థల వాహనాలు వచ్చినప్పుడూ, ట్రాఫిక్ తీవ్రంగా నిలిచిపోతోంది. ఇంతలా ఇబ్బంది ఉన్నా, ఒక్క ట్రాఫిక్ పోలీసు కూడా అక్కడ ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆఫీసులకి, ఇతర కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సాయంత్రం సమయంలో ఈ సమస్య మరింతగా పెరుగుతున్నది. ఇప్పటికైనా పోలీసులు ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

జ్వాలాముఖికి బంగారు నానుతాడు బహూకరణ





బంగారు నానుతాడు రశీదును ఈఓ రేఖకు అందజేస్తున్న రవిశంకర్‌శర్మ (ఇన్‌సెట్లో) నానాతాడు, నాను కోడు

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరాలయ ఉపాలయాల్లో ఒకటైన జ్వాలాముఖీ అమ్మవారికి అమరావతికి చెందిన భక్తుడు శంకరమంచి రవిశంకర శర్మ దంపతులు సోమవారం రూ.5లక్షల విలువైన బంగారు నానుతాడు, నానుకోడు కానుకగా సమర్పించారు. దేవస్థాన సహాయ కమిషనర్ రేఖకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సుధీర్‌శర్మ పాల్గొన్నారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



రసవత్తరంగా సాగుతున్న ఎద్దుల పోటీలు

క్రోసూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు సోమవారం ముగింపు దశకు చేరుకున్నాయి. సీనియర్స్ విభాగంలో సాయంత్రం పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఒంగోలు జాతి ఎడ్లు పది జతలు పోటీలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్ణీత 25 నిమిషాల్లో ఎక్కువ అడుగులు లాగిన జతను విజేతగా ప్రకటిస్తామన్నారు. ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్, తర్వాతి స్థానాల్లో నిలిచిన ఎడ్ల జతలకు రూ.60వేలు, రూ.40వేలు, రూ.30వేలుతో పాటు షీల్డ్‌లు బహూకరించనున్నట్లు తెలిపారు.

వ్యక్తిగత కక్షలతో హత్య

వినుకొండటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షల నేపథ్యంలో పంట పొలానికి వెళ్లిన వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసిన ఘటన మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుంటూరు శివ (37)ను పంట పొలంలోని వర్షపు నీటి పంపిణీలో జరిగిన ఘర్షణలో హత్య చేసి ఉండవచ్చని ఇన్‌చార్జి సీఐ బాలాజి అనుమానం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు, సీఐ బాలాజి ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు భాను వివరాల మేరకు అనుమా నాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్నారు.

అతనికి మద్యం తాగాలనిపిస్తే.. ఆ రోజు ఒక బైకు మాయం

● ఏడాదిన్నరలో 50 ద్విచక్ర వాహనాలు చోరీ ● ఎట్టకేలకు దొంగను పట్టుకున్న కొత్తపేట పోలీసులు



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి

గుంటూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తాగుడికి డబ్బులు అవసర మైనప్పుడు.. అత్తారింటికి వచ్చినట్లు గుంటూరు వస్తాడు. నగరంలో ఏదో ఒకచోట పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని సరదాగా క్షణాల్లో తాళం తీసి వేసుకొని వెళ్లిపోతాడు. అది ఎంతటి ఖరీదైనదైనా.. సరే కేవలం రూ.5 వేలకు తాకట్టు పెట్టి ఆ మొత్తంతో జల్సా చేస్తాడు. ఆ డబ్బు అయిపోగానే.. మళ్లీ చోరీ రిపీటు.. ఇలా గురజాలకు చెందిన బొప్పూరి మల్లికార్జునరావు అలియాస్ పున్నారావు అలియాస్ పెద్ద ఆంజనేయులు ఏడాదిన్నరగా ఇప్పటివరకు 50 ద్విచక్ర వాహనాలు కొట్టేశాడు. వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని ఎట్టకేలకు కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ. 25 లక్షల ఖరీదైన 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మల్లికా ర్జునరావుతో పాటు అతని వద్ద బైకులు చేసిన గురజాలలోని బైకు మెకానిక్ రాజశేఖర్, మహేష్ అనే గొర్రెల కాపరి, సాతులూరుకు చెందిన బేల్దారు మేస్త్రి సాంబశివరావును కూడా అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరంపాలెంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ మీడియా సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వే స్టేషన్, గుంట గ్రౌండ్స్ ఇతర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని చర్యలు తీసుకోవాలని ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరిని ఎస్పీ ఆదేశించారు. సీఐ వీరయ్య చౌదరి నేతృత్వంలో ఎస్సై రమేష్, పోలీస్ బృందంతో ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వే స్టేషన్ ప్రాంతాల వద్ద నిఘా పెట్టారు బొప్పూరి మల్లికార్జున రావు ఈ బైకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు కనిపెట్టారు. మాయ బజార్‌లోని గౌరీ శంకర్ థియేటర్ పరిసరాల్లో దొంగిలించిన బైకులు అమ్మడానికి తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. అనారోగ్యంతో గుంటూరు జీజీహెచ్‌లో చేరి, ఇక్కడే లాడ్జిలో ఉంటూ బేల్దారు పనులు చేసుకుంటున్నట్లు నిందితుడు పోలీసు విచారణలో వెల్లడించాడు. వచ్చిన డబ్బులతో తాగుతూ ఉండేవాడి నని చెప్పాడు. ఇక పనులు చేయకుండా.. తాగడానికి అవసరమైన డబ్బుల కోసం బైక్ దొంగతనాలు చేయలని నిర్ణయించుకున్నట్లు ఒప్పుకున్నాడు. చోరీకి గురైన 13 ద్విచక్ర వాహనాల యజమానులను గుర్తించాల్సి ఉందని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ వీరయ్య చౌ దరిని, ఎస్సై రమేష్‌ని, క్రైమ్ టీం సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

శుద్ధజలాల సరఫరాకు స్పష్టమైన ప్రణాళిక

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల శిక్షణలో కలెక్టర్ వినోద్‌కుమార్



జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధ జలాలు సరఫరా చేసేలా ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. జల సంరక్షణ ప్రణాళికపై స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నాలుగు జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించారు. అనం తరం కలెక్టర్ మాట్లాడుతూ జలవనరుల సంరక్షణ, అభివృద్ధిలోనూ ప్రజల సహకారం ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అ ధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందింపుచ్చుకోవాలని పిలుపుని చ్చారు. గ్రామీణ నీటిసరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. ఇలాంటి శిక్షణలు వ్యక్తిత్వాన్ని మారుస్తాయని, విధుల పట్ల బాధ్యతను మరింత పెంచుతాయని అభిప్రాయపడ్డారు. ఇదే విస్తరణ శిక్షణ కేంద్రంలో తను కూడా ఐఏఎస్ అధికారిగా శిక్షణ పొందానని కలెక్టర్ తెలిపారు. జల జీవన్‌మిషన్ పనులు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జలవనరుల సుస్థిరాభివృద్ధి, తాగునీటి నిరంతర సరఫరా లక్ష్యంతో అధికారులు పనిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ పేర్కొన్నారు. జల సంరక్షణ ప్రణాళికలు గ్రామస్థాయిలో రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పర్యవేక్షణ ఇంజనీర్ రాఘవులు, ఎస్‌ఈ అనంతరాజు, డీపీఓ ప్రభాకరరావు, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు పాల్గొన్నారు.

నూజివీడు సీడ్స్ అధినేత వెంకట్రామయ్యకు ఘన నివాళి



నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకట్రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నూజివీడు సీడ్స్ అధినేత దివంగత మండవ వెంకట్రామయ్య రైతాంగానికి చేసిన సేవ లు వెలకట్టలేనివని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమ వారం పేర్కొన్నారు. నూజివీడు సీడ్స్ ద్వారా నాణ్యమైన హైబ్రీడ్ విత్త నాలను అభివృద్ధి చేసి, సరఫరా చేయడం ద్వారా ఎంతోమంది పత్తి రైతులకు మార్గదర్శకులయ్యారన్నారు. నూజివీడు మండలం తుక్కు లూరు గ్రామంలో జరిగిన వెంకట్రామయ్య దశ దినకర్మ కార్యక్ర మానికి ప్రత్తిపాటి హాజరై వెంకట్రామయ్య చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. వెంకట రామయ్య కుమారుడు ఎస్‌ఎస్‌ఎల్ గ్రూపు సంస్థల చైర్మన్ ప్రభాకరరావు, ఇతర కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. చిలకలూరిపేట ప్రాంతానికి చెందిన ప్రముఖ పత్తి వ్యాపారులు, నూలు మిల్లుల నిర్వాహకులు కందిమళ్ల శ్రీనివాసరావు, సామినేని కోటేశ్వరరావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, ఎం.లింగయ్యచౌదరి, పెరవలి కోటిరావు, లంకా రఘురామిరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

సీఆర్డీఏ భవనానికి హంగులు



సీఆర్డీఏ కార్యాలయం వద్ద అధికారులతో ఏడీసీ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ పార్థసారథి

తుళ్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీఆర్డీఏ కొత్త భవనం రంగుల హంగులతో ముస్తాబవుతోంది. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారధి ఆదేశాల మేరకు సీఆర్డీఏ భవనం ఎదుట ఆకర్షణీయమైన, ఏడాది పొడవునా పూసే పూల మొక్కలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. వెంకటపాలెం ఏడీసీ నర్సరీలో ప్రత్యేకంగా పెంచుతున్న మొక్కలను ఇక్కడ ప్లాంటేషన్ చేస్తున్నారు. శీతల దేశాల్లో ఎక్కువగా కనిపించే టబూబియా అర్జెంషియా, అవలాండా, కాస్సియా పీస్టులా, మిల్లింగ్ టోనియా, కాస్సియా జవానికా, ఫ్లుయేరియా వంటి విలువైన మొక్కలు తెలుపు, గులాబీ, పసుపు రంగుల్లో పూలు పూస్తాయి. వీటిని సీఆర్డీఏ భవనం ఎదుట, పరిసర ప్రాంతాల్లో సుమారు 300 మొక్కల ఏర్పాటుకు ఏడీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక్కడ చేపడుతున్న పచ్చదనం అభివృద్ధి పనులకు ఏడీసీ నర్సరీ మొక్కలు కావడంతో కేవలం రూ.16 లక్షలు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. సీఆర్డీఏ పార్కింగ్, వీఐపీ పార్కింగ్, క్యారిడార్ల వెంట కనువిందు చేసేలా గ్రీన్‌లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

దర్యాప్తు పూర్తయితే చార్జిషీట్ వేయలేదేం?

మృతురాలే వాంగ్మూలమిచ్చినట్లు కొత్త కథ అల్లారు
విద్యార్థిని మృతి కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై హైకోర్టు అసహనం..
కోర్టు ఉత్తర్వులంటే గౌరవం లేదని ఘాటు వ్యాఖ్య
తదుపరి విచారణ ఈ నెల 10కి వాయిదా

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా బుడంపాడులోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పాలిటెక్నిక్ విద్యార్థిని మృతి ఘటనపై దర్యాప్తు పూర్తి చేసి, చార్జిషీట్ దాఖలు చేయకపోవడం పట్ల హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. విద్యార్థిని మృతి విషయంలో దాఖలైన రిట్ పెండింగ్‌లో ఉండటంతో చార్జిషీట్ వేయలేదన్న పోలీసుల వాదనను తప్పుపట్టింది. దర్యాప్తు పురోగతిపై పోలీసులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలిస్తే, కోర్టు, భవనంపై నుంచి తాను పడిపోయినట్లు మృతురాలే వాంగ్మూలం ఇచ్చిందని అందులో పేర్కొనడాన్ని ఆక్షేపించింది. పోలీసులు కొత్త కథ అల్లారని వ్యాఖ్యానించింది. ఆస్పత్రికి తీసుకొచ్చే సమయానికే విద్యార్థిని మృతి చెందినప్పుడు.. మరణ వాంగ్మూలం నమోదు చేయడం ఏ విధంగా సాధ్యమని ప్రశ్నించింది. చార్జిషీట్ దాఖలు చేయవద్దని కోర్టు నుంచి నిషేధ ఉత్తర్వులేమీ లేవు కదా అని పోలీసులను ప్రశ్నించింది. కోర్టుల ఉత్తర్వుల పట్ల పోలీసులకు గౌరవముంటుందని తాము భావించడం లేదని వ్యాఖ్యానించింది. కోర్టులన్నా, కోర్టు సిబ్బంది అన్నా, కోర్టు ఉత్తర్వులన్నా పోలీసులకు గౌరవం లేదని ఘాటుగా వ్యాఖ్యలు చేసింది. పోలీసులు వేసిన అఫిడవిట్‌ను పరిశీలించి వాదనలు వినిపించేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు కల్పిస్తూ, తదుపరి విచారణను ఈ నెల పదోతేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టుదేవానంద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. గుంటూరు జిల్లా గోపాయపాలేనికి చెందిన గర్నెపూడి శ్రావణ సంధ్య (17) అనే విద్యార్థిని బుడంపాడు సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లమో మొదటి సంవత్సరం చదువుతూ, కళాశాల హాస్టల్‌లోనే ఉంటోంది. శ్రావణ సంధ్య హాస్టల్‌లోని నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయినట్టు 2017 ఫిబ్రవరి 28న వార్డెన్ నుంచి తల్లిదండ్రులకు ఫోన్ వెళ్లింది. ఈ ఘటనపై గుంటూరుజిల్లా నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తన కుమార్తెను హత్య చేశారని, పోలీసులు కేసును సక్రమంగా దర్యాప్తు చేయడం లేదని పేర్కొంటూ మృతురాలి తల్లి 2017లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఘటనపై సీఐడీ లేక సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా, దర్యాప్తులో పురోగతి లేకపోవడంపై న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తే యువతి ప్రమాదవశాత్తు పడిపోయిందని తెలుస్తోందని, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరని ఒకవైపు చెబుతూ, మరోవైపు ఈ ఘటనపై ప్రత్యక్ష సాక్షులు, హాస్టల్ విద్యార్థులు వాంగ్మూలాలు ఇచ్చారంటూ పరస్పర విరుద్ధ వివరాలను ఎలా వెల్లడిస్తారంటూ ఆయన తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తును సీబీఐకు అప్పగించడమే సముచితమని అభిప్రాయపడ్డారు. కేసు దర్యాప్తు పురోగతిపై వాస్తవాలు పేర్కొంటూ అఫిడవిట్ వేయాలని గుంటూరు ఎస్పీని ఆదేశించారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా, హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది జయంతి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు ముగిసిందని, రిట్ పిటిషన్ పెండింగ్‌లో ఉందనే కారణంతో పోలీసులు తుదినివేదిక దాఖలు చేయలేదన్నారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా దర్యాప్తు పురోగతిపై జిల్లా ఎస్పీ అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. విద్యార్థిని భవనంపై నుంచి పడిన సీసీటీవీ ఫుటేజీ, సాక్షుల వాంగ్మూలాలు, పోస్టుమార్టమ్ రిపోర్ట్‌ను అఫిడవిట్‌కు జత చేశామని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ...రిట్ పెండింగ్‌లో ఉందనే కారణంతో చార్జిషీట్ దాఖలు చేయలేదన్న వాదన పై అసంతృప్తి వ్యక్తం చేశారు.

వేగంగా కొండమోడు - పేరేచర్ల రహదారి నిర్మాణం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొండమోడు - పేరేచర్ల మధ్య జాతీయ రహ దారి 167ఏజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టరు ను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. సో మ వారం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో 167 ఏజీ, 167ఏ హైవేల నిర్మాణ పనులపై ఆమె సమీక్ష నిర్వహించారు. పిడుగురాళ్ళ - సత్తెనపల్లి - పేరేచర్ల రోడ్డు వెడల్పు తక్కు వగా ఉండటంతో హైదరా బాద్ వెళ్లే వాహనాల రద్దీతో ఇబ్బందిగా మారిందన్నారు. ప్రజల సౌకర్యార్థం రోడ్డు విస్తరణ పనులు ముందుగా ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. నకరికల్లు - వాడ రేవు జాతీయ రహదారి భూ సేకరణకు రైతులకు ఆమోదయో గ్యమైన ధరను నిర్ణయిస్తామన్నారు. ఈ సమావేశంలో జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, జాతీయ రహదారుల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెస్సీ యోగా' నోటిఫికేషన్ విడుదల



ఏఎన్‌యూ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వ్యాయామ కళాశాలలో ఏడాది జీపీ డిప్లమో ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్, రెండేళ్ల ఎమ్మెస్సీ ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్, యోగా లేటరల్ ఎంట్రీ కోర్సులలో మంగళ వారం నుంచి ఈ నెల 20 వరకు ప్రవేశాలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పాల్‌కుమార్ సోమ వారం తెలిపారు. ప్రవేశాలు తమ కార్యాలయంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఎంఎస్సీ యోగా కోర్సులో ప్రవేశానికి డిగ్రీ ఉత్తీర్ణత, ఎమ్మెస్సీ యోగ లేటరల్ ఎంట్రీ కోర్సుకి ఏఎన్‌యూ పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్స్ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. పీజీ ప్రవేశాల కార్యాలయం భర్తీ చేసిన అనంతరం.. మిగిలిన సీట్లకు మాత్రమే తాము ప్రవేశాలు కేటాయిస్తామని పేర్కొన్నారు.

యడ్లపాడు ఏఈఎల్‌సీ హైస్కూల్
గుర్తింపు పునరుద్ధరించండి

● 12ఎకరాల భూమి కొట్టేసే ప్రయత్నాలను అడ్డుకోండి



ఆర్‌జేడీకి వినతి పత్రం అందిస్తున్న ఏఈఎల్‌సీ ప్రతినిధులు

గుంటూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుమారు 70 ఏళ్ల చరిత్ర కలిగిన యడ్లపాడు లూథరన్ హైస్కూల్ గుర్తింపును పునరుద్ధరించాలని ఏఈఎల్‌సీ ప్రతినిధులు పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీకి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రతినిధులు ఏఈఎల్‌సీ కంట్రోలర్ కార్యదర్శి జేసు రత్నకుమార్, పరిపాలనా అధికారి జోసఫ్ పీఎస్ మాట్లాడుతూ యడ్లపాడులో లూథరన్ సంఘ విద్యాలయం అభివృద్ధికి కేటాయించిన 12 ఎకరాల భూమిని కొట్టేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే.. లూథరన్ హైస్కూల్‌కు కొంచెం దూరంలోనే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్దేశపూర్వకంగా జడ్పీ ఉన్నత పాఠశాలను నిర్మించారన్నారు. ఈ స్కూల్ నుంచి పిల్లలను పక్క స్కూల్‌కి తరలించారని, దీంతో ప్రస్తుత విద్యా సంవత్సరానికి అధికారులు గుర్తింపు నిరాకరించారని వివరించారు. స్కూల్ ఆస్తిపై కన్ను వేసిన వారిని వెంటబెట్టుకుని డిప్యూటి జిల్లా విద్యాధికారి స్కూల్ రికార్డులు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రెవ. బాబురావు, రేవ.శ్యాం సంపత్, రేవ. ఇసుకపాటి శ్యాం, రేవ సతీష్, కార్పొరేటర్ రాజాలత, ట్రినిటీ పారిష్, నార్త్, ఈస్ట్ , వెస్ట్ పారిష్ ప్రతినిధులున్నారు.

బైకును ఢీకొట్టిన లారీ.. ఒకరి మృతి

తెనాలి అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో.. ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. వైకుంఠపురం - జగ్గడిగుంటపాలెం వంతెనల మధ్య సోమవారం ఈ ప్రమాదం చోటుచేసు కుంది. గార్మి పండగకు తెనాలి వచ్చి.. స్వగ్రామం అప్పికట్లకు ముగ్గురూ వెళ్తున్నారు. ఈ ఘటనలో షేక్ నాయబ్ రసూల్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గౌస్‌బాషా, మరొక బాలుడిని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	133, 142, 153
చికెన్ విత్ స్కిన్(కిలో)	254.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	264.00

27,562 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 29,714 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 27,562 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,273 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14300	334	10500	14300
273	---	---	నెంబరు. 5	10000	14000
341	10000	14600	273	----	----
4884	----	----	341	10000	15000
సూపర్ 10	----	----	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14800	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10000	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

స్వచ్ఛ అవార్డు అందుకున్న మేయర్, కమిషనర్

గుంటూరుకార్పొరేషన్,అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థరాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు 2025 స్పెషల్ కేటగిరిలో అవార్డ్ అందుకోవడం గర్వకారణంగా ఉందని మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాష్ట్ర స్థాయి స్వచ్ఛ అవార్డ్ 2025 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా మేయర్, కమిషనర్లు అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం, రాష్ట్రం ఎక్కడైనా స్వచ్ఛ అవార్డ్ అంటే తప్పనిసరిగా గుంటూరు నగరపాలక సంస్థ నిలిచేలా గత ఏడాది కాలంగా ప్రజారోగ్య రంగాన్ని తీర్చిదిద్దామన్నారు. ఈ అవార్డును ప్రజారోగ్య కార్మికులకే అంకితం ఇస్తున్నామన్నారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల గుంటూరు జిల్లా స్థాయి బహుకరణ కార్యక్రమం సోమవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా జరిగిన కార్యక్రమంలో ఉత్తమ స్వచ్ఛత వారియర్స్ (పారిశుద్ధ్య కార్మికులు) గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన కల్లా సుమలతకు కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు, ప్రజా ప్రతినిధులు అందించారు.

చుట్టుగుంట రైతుబజార్‌కు స్వచ్ఛత అవార్డు ప్రదానం

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట రైతుబజార్‌కు రాష్ట్ర స్థాయి స్వచ్ఛ అవార్డుని సీఎం చంద్రబాబునాయుడు ప్రదానం చేశారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రైతుబజార్ల సీఈవో మాధవీలత, మార్కెటింగ్ ఏడీ సత్యన్నారాయణ చౌదరి, ఎస్టేట్ అధికారి పెద్దింటి లావణ్య అవార్డుని అందుకొన్నారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ చుట్టుగుంట రైతుబజార్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని రైతుబజార్లను పరిశుభ్రంగా మారుస్తామని చెప్పారు.



సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదగా స్వచ్ఛ రైతుబజారు రాష్ట్ర స్థాయి అవార్డుని అందుకొంటున్న మార్కెటింగ్ ఏడీ సత్యన్నారాయణ చౌదరి, రైతుబజార్ ఈవో లావణ్య

అన్న క్యాంటిన్‌లను పర్యవేక్షించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్నక్యాంటీన్లలో ఆహార సరఫరా సమయాలల్లో పర్యవేక్షణ కోసం విధులు కేటాయించిన వార్డ్ సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షణ చేసి, ఏమైనా లోపాలు గుర్తిస్తే నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం అమరావతి రోడ్ లోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.



అన్న క్యాంటీన్లో టిఫిన్ చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఫిర్యాదుల పరిష్కారానికి విభాగాధిపతులు శ్రద్ధ చూపాలి

గుంటూరు నగరపాలక సంస్థ ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 22 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

ఆక్రమణలు తొలగించాలి

గుంటూరు నగరంలో రోడ్లు, డ్రైన్లు ఆక్రమణ చేసి మురుగు, వర్షం నీటి పారుదలకు అడ్డుగా ఉన్నవాటిని స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే ప్రజా సౌకర్యార్థం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక సిబ్బంది, అధికారులు తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ పట్టాభిపురం మెయిన్ రోడ్, అమరావతి రోడ్, విజయపురి కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్ ఆక్రమణలను పరిశీలించి, వాటి తొలగింపుకు ఆక్రమణదారులు, పట్టణ ప్రణాళిక అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్‌కు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్‌కు జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు దక్కింది. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల పంపిణీలో భాగంగా గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



కలెక్టర్ అన్సారియా చేతుల మీదుగా అవార్డులందుకుంటున్న ఎస్ఈ రమేష్, ఈఈ శ్రీనివాసబాబు తదితరులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బి ఆర్ స్టేడియం అంకమ్మతల్లి ఆలయం, కమ్యూనిస్టు బొమ్మల సెంటర్, ఆలీనగర్, సూర్యనగర్, బావాజీమఠం, ముగ్దుం నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ వీ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

స్పష్టమైన పరిష్కారం చూపాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా
● పీజీఆర్ఎస్‌కు 220 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ శ్రీ వాస్తవ తదితరులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీ పరిశీలించి స్పష్టమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పిజీఆర్ఎస్‌కు 220 అర్జీలు అందాయి. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్వో ఖాజావలి, పిజీఆర్ఎస్ నోడల్ అధికారి గంగారాజుతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలకు పరిష్కారం చూపినప్పుడే అర్జీదారులకు సంతృప్తి కలుగుతుందని చెప్పారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతీ అర్జీని నిర్దేశిత సమయంలో పరిష్కరించాల్సిందే అన్నారు. అర్జీలకు సంబంధించి స్పష్టమైన, వాస్తవ వివరాలు మాత్రమే ఇవ్వాలని చెప్పారు. ప్రీ ఆడిట్ సక్రమంగా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నిషేధిత జాబితా నుంచి తమ స్థలాలను తొలగించాలని అడవితక్కెళ్ళపాడుకు చెందిన స్థానికులు అర్జీ అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సత్యనారాయణ, నాగరాజు, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

● సినిమా థియేటర్ల యాజమాన్యాలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ నాయకులు అకిటి అరుణ్ కుమార్, జంగాల చైతన్య, దూపాటి వెంకటరత్నం అర్జీ అందజేశారు.

● తుళ్లూరు మండలం, అనంతవరం గ్రామంలో ఉన్న గోశాలలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● బృందావన్ గార్డెన్స్‌లోని దివ్యాంగుల వసతి గృహంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయవద్దని కోరుతూ విజువల్లి ఛాలెంజ్డ్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అంధులు అర్జీ అందజేశారు.

● తమ భూమిని ఆక్రమించుకొని వేరే వారికి అమ్మారని గోరంట్లకు చెందిన ప్రతిభ, ప్రశాంతి అనే మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

హరిత గుంటూరు ఆవిష్కృతం కావాలి : కలెక్టర్

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పచ్చదనంతో నింపి హరిత గుంటూరును ఆవిష్కృతం చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. వనం - మనం జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జరిగింది హరిత గుంటూరు జిల్లాలో అన్ని శాఖలు సమష్టిగా, సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా సంస్థలు, ఇతర కార్యాలయాలు, ఖాళీ స్థలాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలు, వాటిలో అధిగమించిన అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీలో మొక్కలు నాటేందుకు కార్యాచరణ సమర్పించాలన్నారు.

జిల్లా అటవీ అధికారి హిమ శైలజ మాట్లాడుతూ 2,443 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గుంటూరు జిల్లాలో కేవలం 47.80 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో (1.90 శాతం మేర) మాత్రమే పచ్చదనం ఉందన్నారు. మిషన్ హరిత ఆంధ్ర ప్రదేశ్‌లో భాగంగా 2029 సంవత్సరం నాటికి 37 శాతం పచ్చదనం ఉండాలన్నారు. 2025-26 సంవత్సరంలో అన్ని శాఖల సమన్వయంతో 330 హెక్టార్లలో మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా 503 హెక్టార్లలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. 2026-27 సంవత్సరంలో 311 హెక్టార్లు, 2027-28 సంవత్సరంలో 335 హెక్టార్లు, 2028 - 29 సంవత్సరంలో 344 హెక్టార్లు, 2029 -30 సంవత్సరంలో 365 హెక్టార్లలో పచ్చదనం పెంచుటకు లక్ష్యంగా ఉందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ పాల్గొన్నారు.



హరిత గుంటూరుపై కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

గుంటూరు (విద్య) అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థులు వర్క్ షాప్స్ (కార్యశాల) లను ఉపయోగించుకొని నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమా శంకర్ రెడ్డి సూచించారు. సోమవారం చౌడవరం లోని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వర్క్ షాప్ లో ఆయన మాట్లాడారు. ఇటువంటి వర్క్ షాపులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అవకాశం కల్పిస్తాయని తెలిపారు.ఇదిలా ఉంటే ఎక్సెల్ ఆర్ ఎడ్యుటెక్ సంస్థ సహకారంతో "ఎక్స్ప్లొరైటరీ డేటా ఎనాలసిస్ విత్ పైథాన్" అంశంపై 9 రోజుల వర్క్ షాప్ నిర్వహించినట్లు సిఎస్ సి విభాగాధిపతి రాజీవ్ జట్సన్ తెలిపారు కార్యక్రమంలో ఎక్సెల్ ఆర్ ఎడ్యుటెక్ ప్రతినిధి లక్ష్మణ్ అధ్యాపకులు డాక్టర్ ఏ శ్రీనివాసరావు, చుక్క శ్యామ్ సన్, కే నాగేశ్వరరావు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు

గుంటూరు (తూర్పు) అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) :స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వ రస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమ వారం శ్రీమద్భగవద్గీత అష్టాదశ అధ్యాయంలోని మోక్ష సన్యాస యోగంపై అధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ పాలకమండలి వారు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయమిషన్ బ్రహ్మాచారి సువీరానందస్వామి ప్రవచిస్తూ మోక్ష సన్యాస యోగంలో సన్యాస తత్త్వము, త్యాగతత్త్వము గూర్చి తెలియజేస్తూ పుత్ర ధనాది ప్రియ వస్తు ప్రాప్తికి, రోగములు మొదలగు వాటిని నివృత్తికి చేసే ఉపాసనలను సన్యాసమని, సర్వకర్మ ఫలములను త్యజించుటను త్యాగమని అంటారన్నారు. సన్యాసము, త్యాగము అనే రెండు విషయాలని, త్యాగము సాత్వికము, రాజసము, తామసము అని మూడు విధాలుగా చెప్పారన్నారు.



ప్రవచనం చేస్తున్న సు వీరానంద స్వామి

వైభవంగా చండీ హోమం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీ అష్టలక్ష్మి మందిరం నిర్వాహకులు మర్రిపాటి ప్రసాదు ఆధ్వర్యంలో నిడుముక్కల గ్రామంలో ఉన్న గోశాలలో వేదపండితుల వేదమంత్రాలతో చండీహోమం, మహా పూర్ణాహుతి జరిగింది. అనంతరం కాలాలలో పవిత్ర జలాలతో భక్తులకు సంప్రోక్షణ, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



మహా పూర్ణాహుతి చేస్తున్న వేద పండితులు

ఉద్యోగులకు సూపర్ సిక్స్ డిమాండ్లను అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సూపర్ సిక్స్ మాదిరిగానే ఉద్యోగులకు సూపర్ సిక్స్ డిమాండ్లను అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. స్థానిక అంకమ్మనగర్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 వేతన సవరణ కమిటి నియమించాలని, ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్ డిఏలను విడుదల చేయాలని, నగదు రహిత వైద్య చికిత్స, రూ 30 వేల బకాయిలు విడుదల, వైద్య విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు యాప్‌లభారం తొలగించాలనే ఆరు డిమాండ్లను అమలు చేయాలన్నారు. డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, షాకాద్రి, నాగేశ్వరరావు, ఈశ్వరప్రసాదు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ చాంద్ బాషా, పాల్గొన్న సంఘ సభ్యులు

సీఐజే గవాయ్‌పై దాడి గర్హనీయం

● ఐలూ నేతలు సుంకర, నల్లూరి ఖండన

విజయవాడ లీగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రయత్నం న్యాయవ్యవస్థపై, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో అభివర్ణించారు. రాజ్యాంగాన్ని రక్షించడంలోనూ, నిర్దేశించిన మౌలిక సూత్రాల్లో ఒకటైన భౌతికతత్వాన్ని రక్షించడంలోనూ ఆయన ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. రాజ్యాంగం కంటే సనాతన ధర్మమే గొప్పదని ప్రచారం చేసి ప్రజల మధ్య చిచ్చుపెట్టి, మత విభజనను, మత విద్వేషాన్ని రేపుతున్న సంస్థలు, పాలకుల తీరువల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని సుంకర, నల్లూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిని ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ) తీవ్రంగా ఖండిస్తోందని, దాడిచేసిన వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌కు రక్షణ మరింత పెంచాలని, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడాలని ఐలూ తరఫున భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు రాజేంద్రప్రసాద్, మాధవరావు తెలిపారు.

ప్రజలకు సులభతర న్యాయమే ప్రధాన ఉద్దేశం

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సులభంగా న్యాయం అందించడమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రధాన ఉద్దేశమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని, జిల్లా ప్రజల నుంచి వచ్చిన వివిధ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజా సమస్యలపై త్వరితగతిన స్పందించి, నిర్ణీత గడువులోగా చట్ట పరమైన పరిష్కారం చూపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి ముఠా నుంచి రక్షణ కల్పించండి

చిలకలూరిపేట జాతీయ రహదారిపై సీఆర్ నగర్ వద్ద గంజాయి ముఠా ఆగడాల నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆ ప్రాంత మహిళలు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. సమీపంలోని క్వారి వద్ద నిత్యం గంజాయి సేవిస్తూ దారిన వచ్చి పోయే వారిపై దాడులు చేయడం, డబ్బులు, సెల్ ఫోన్లు లాక్కోవడం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే తిరిగి తమపైనే దాడికి పాల్పడుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

ఖాతాలో డబ్బులు కొట్టేశారు

తన ప్రమేయం లేకుండా తన పేరుతో బ్యాంకు ఖాతా తెరిచి ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బును కొట్టేశారని సత్తెనపల్లి మండలం కంటేపూడి గ్రామానికి చెందిన కూచిపూడి జ్యోతి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. భర్త మృతి చెందడంతో ఇద్దరు కుమారులు, కుమార్తెలతో కాకినాడ జిల్లా తుని వెళ్లి కూలి పనులు చేసుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. తన భర్త చనిపోయిన మూడు నెలలకు మరిది, కొత్తపేటలోని కోస్టల్ బ్యాంకు మేనేజర్ ఇద్దరూ కుమ్మక్కై..అదే బ్యాంకులో తన పేరుతో ఖాతా తెరిచారన్నారు. తన భర్త పేరుమీద వచ్చిన చంద్రన్న బీమా నగదు ఆ ఖాతాకు జమకావడంతో వాళ్లిద్దరూ కొట్టేశారని వాపోయింది. తల్లికి వందనం, విద్యా దీవెన ఇలా వివిధ పథకాల నగదు కూడా ఇలానే తీసుకున్నారని చెప్పింది. ఈ విషయం బ్యాంకు మేనేజర్, మరిది తనను బెదిరిస్తున్నారని చెప్పుకొచ్చింది.

రెండున్నర లక్షల ఐరన్ దోచుకెళ్లారు

తాను ఇంట్లో లేని సమయంలో ఈదా పరశురాం రెడ్డి, ఈదా కోటిరెడ్డి అనే ఇద్దరు 40 మంది అనుచరులతో వచ్చి ఇంటిపై దాడి చేసి షెడ్డును కూల్చివేశారని హోసన్నగుంట ప్రాంతానికి చెందిన ఏరువా జయప్రకాశ్ రెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కూల్చేసిన షెడ్డు ఐరన్ రాడ్స్‌ను అపహరించుకుపోయారన్నారు.

సమ్మెలో పాల్గొనం..!

● తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం నేతలు

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రకటించిన దశలవారీ నిరసన కార్యక్రమాలకు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం దూరంగా ఉంటుందని సంఘ నాయకులు తెలిపారు. తమ సభ్యులు అత్యవసర సేవల విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. జేఏసీ పిలుపు మేరకు అక్టోబర్ 6 నుంచి ప్రారంభమయ్యే ధర్నా కార్యక్రమాల్లో తమ యూనియన్ సభ్యులు పాల్గొనరని స్పష్టం చేశారు. ఈ మేరకు ఏపీ డీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల యూనియన్ సభ్యులందరికీ తెలియజేశామన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

పేదల ఆరోగ్య భద్రతకే ప్రభుత్వ ప్రాధాన్యం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్
● రూ.26 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం, ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, వారి ఆరోగ్యానికి రక్షణ కవచంగా సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని అనారోగ్య బాధితులకు సోమవారం ఆయన తన కార్యాలయంలో రూ.26 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా ఒక్కరూ కూడా ఇబ్బందులకు పడకూడదనే కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో పేద వర్గాల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.5.41 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ నిధులతో ప్రజల ప్రాణాలు కాపాడామని చెప్పారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామని, ఆస్పత్రిలో అవసరమైన పరికరాలు, సిబ్బంది కొరత సమస్యలపై కొద్ది రోజుల క్రితం ఆరోగ్య శాఖ కమిషనర్‌కు విన్నవించామని వివరించారు. త్వరలోనే జీజీహెచ్‌కు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గంజాం రాఘవేంద్ర, గోళ్ళ ప్రభాకర్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఓబన్న పోరాటం చారిత్రాత్మకం

బ్రిటీష్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం, త్యాగం, వీరత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా సోమవారం తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటయోధుడు, రేనాటి ముద్దుబిడ్డ వడ్డే ఓబన్న అని కొనియాడారు.

ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రశంసనీయం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ కుమార్



డాక్టర్ కత్తెర సురేష్ కుమార్

గుంటూరు సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల్లో లేకపోయినప్పటికీ ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రవేశపెట్టటం ప్రశంసనీయం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలనే ఆశయంతో అరు లైన వారికి రూ.15 వేలు అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల మేరకు సూపర్ సిక్స్ లో భాగమైన తల్లికి వందనం, రైతులకి అన్నదాత భరోసా, ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం ఇప్పటికే అమలు చేశారన్నారు. ఆటో డ్రైవర్లకు రూ. 15 వేల ఇచ్చే పథకం సూపర్ సిక్స్ లో లేనప్పటికీ ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితిని గమనించి వారికి నగదు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉన్నత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు దక్కుతుందన్నారు. ఇప్పటికే పేదవాడి ఆకలి తీరుస్తూ అన్నా క్యాంటీన్లు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. వాటిని అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారని వెల్లడించారు.

రాజధాని అసైన్డ్ రైతుల్లో గుబులు!

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూములిచ్చిన అసైన్డ్ రైతులకు లభించిన ఊరట ఇలా వచ్చి అలా వెళ్లిపోయినట్లయింది. రైతులకు ఇచ్చే పట్టాల్లో అసైన్డ్ పదం తొలగించాలంటూ రాష్ట్ర పురపాలక శాఖ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయడంలో నెలకొన్న గందరగోళమే అందుకు కారణంగా తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ పట్టాల్లో ఉన్న అసైన్డ్ పదం తొలగించి కొత్తగా పట్టాలిస్తారని ఆశించిన రెండున్నర వేల మందికి పైగా రైతులకు సీఆర్డీఏ కార్యాలయాల్లో అనూహ్య పరిస్థితి ఎదురవుతోంది. దీంతో వారు ఆందోళనకు గురవుతున్నారు.

రాజధాని అమరావతి నిర్మాణం కోసం 3,139 మంది అసైన్డ్ రైతులు 2,689.14 ఎకరాల భూములు ఇచ్చారు. వీరు ఇచ్చిన భూములకు సంబంధించి సీఆర్డీఏ ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల పట్టాలు సమస్యాత్మకంగా తయారయ్యాయి. రైతులకు ఇచ్చిన పట్టాల్లో వారు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావాన్ని తెలియజేస్తూ 'అసైన్డ్' అనే పదాన్ని చేర్చారు. 'అసైన్డ్' అనే పదాన్ని తొలగించాలని రైతులు కోరిన మీదట ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవో అమలు విషయంలో గందరగోళం నెలకొంది. ఈ జీవో ప్రకారం ఇప్పటి వరకూ రిటర్నబుల్ ప్లాట్ల పట్టాలు తీసుకోనివారికి ఇచ్చే కొత్త పట్టాల్లో మాత్రమే ఆ మార్పు చేస్తున్నట్లు అసైన్డ్ రైతులు చెబుతున్నారు. తమ పట్టాల మార్పుకోసం సీఆర్డీఏ కార్యాలయానికి వెళితే పాతవారికి కాదు, కొత్తవారికి మాత్రమే అని చెప్పి తిప్పి పంపిస్తున్నారని చెబుతున్నారు. అయితే ఇప్పటికే 95 శాతం మంది రైతులు పట్టాలు పొంది ఉన్నారు. వారి పట్టాల సవరణ చేయకపోతే జీవో వచ్చీ ఉపయోగం ఉండదు. దీంతో రైతుల్లో గుబులు మళ్లీ మొదలయింది.



పోస్టర్ విడుదల చేస్తున్న జూపూడి రంగరాజు తదితరులు

మహా రుద్రాభిషేకం పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు (విద్య) అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కార్తీక మాసంలో నిర్వహించే మహా మహా రుద్రాభిషేక పోస్టర్స్ ను సోమవారం ఆవిష్కరించారు. అమరావతి రోడ్ లోని హిందూ ఫార్మసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పాల్గొన్నారు ఉచిత ఎంట్రీ పాస్ కావాల్సిన వారు బ్రాడీపేట 3/9 లోగల ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నిర్వాహకురాలు గాయత్రి బెహరా, వనమా నరేంద్ర కుమార్ విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ప్రత్తిపాటి మాధవ శర్మ, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు చిరుమామిళ్ల గోపికృష్ణ, భజరంగ్‌దళ్ అధ్యక్షుడు మహేష్ శాస్త్రి, సాదు సాయి, రామరాజు త్రికోటేశ్వరరావు, శంకరమంచి నాగ సాయి, రాజేష్, కార్తికేయ, సంతోషి, పొడుగు కృష్ణారావు, అనిల్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా ప్రత్యేక తరగతులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక టిజేపీఎస్ కళాశాలలో నేటి నుంచి 11వ తేదివరకు యోగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు వలంటీరు సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. హఠ యోగ అభ్యాసాలు, మనస్సు నియంత్రణపై తరగతులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి 10వ తేది వరకు ఉదయం సూర్యక్రియ, సాయంత్రం యోగాసనాలు, 11న ఉదయం భూతసిద్ధి అనే ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98851 98095 అనే నెంబరులో సంప్రదించాలని సూచించారు.

కృత్రిమ మేధతో వ్యవసాయ రంగంలో కొత్త విప్లవం

సీఎం చంద్రబాబు మానస పుత్రిక అయిన క్వాంటం కంప్యూటర్ ద్వారా అందుబాటులోకి రాబోతున్న అత్యాధునిక కృత్రిమ మేధతో వ్యవసాయ రంగంలో కొత్త విప్లవం వస్తుందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కృత్రిమ మేధస్సుతోనే వ్యవసాయాన్ని లాభాల బాట పట్టించే అవకాశం ఉన్నప్పటికీ క్వాంటం కంప్యూటింగ్ ద్వారా మరిన్ని అద్భుతాలు సృష్టించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఒక సమస్యకు అనేక పరిష్కారాలు చూపే క్వాంటం కంప్యూటింగ్ ద్వారా నేల సామర్థ్యం అంచనా వేయటంతో పాటు, పంటల ఆరోగ్య విశ్లేషణ, మార్కెటింగ్ అవకాశాలు మెరుగు పర్చుకోవటం వంటివి రైతులకు లాభాలు తెచ్చిపెడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధస్సు-వ్యవసాయం అనే అంశంపై డాక్టర్ పీవీ సత్యనారాయణ సోమవారం 'ఆంధ్రజ్యోతి' తో ప్రత్యేకంగా మాట్లాడారు.



● తెలగ్గా పంట ఆరోగ్య విశ్లేషణ, నేల సామర్థ్యం పరీక్షలు

● వాతావరణ అంచనాతో పంట నష్టం తగ్గింపు

● ఎన్జీ రంగా రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

కృత్రిమ మేధస్సు ఆధారిత డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాల ద్వారా పెద్ద వ్యవసాయ క్షేత్రాలను శీఘ్రంగా నిశితంగా పరిశీలించవచ్చు. అల్గారిథమ్‌లో ఈ చిత్రాలను విశ్లేషించి కలుపు మొక్కలు, పోషక లోపాలు, నీటి ఒత్తిడి, తెగుళ్లు, కీటక దాడులను ముందుగా గుర్తించి పంట ఎదుగుదలను, దిగుబడి సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు. రైతులు తమ స్మార్ట్‌ఫోన్‌లలో పంట ఆకులను ఫోటో తీసి మొబైల్‌లోని కృత్రిమ మేధస్సు యాప్‌కు అందించినట్లయితే, ఆ యాప్ తెగుళ్లు, పోషక లోపాలను తక్షణమే గుర్తించి పరిష్కారాలు సూచిస్తుంది. నేలలో అమర్చిన తేమ, ఉష్ణోగ్రత సెన్సార్లు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికత ద్వారా నేల తేమ స్థాయిని, వాతావరణ పరిస్థితులను అంచనా వేసి మొక్కలకు ఎప్పుడు, ఎంతమేర నీరివ్వాలో నిర్ణయిస్తాయి. నేలకు అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు ఎంత మోతాదులో ఉపయోగించాలో సూచనలిస్తుంది. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ తో అనుసంధానించిన ట్రాక్టర్లు, దుక్కి యంత్రాలు, విత్తనాలు నాటే యంత్రాలు స్వయంచాలకంగా పనిచేసి కూలీల ఖర్చును తగ్గిస్తాయి.

● తెగుళ్ళు, కీటకాల నిర్వహణకు, మార్కెట్ వ్యూహాలకు

కృత్రిమ మేధస్సు అల్గారిథమ్లు చారిత్రక డేటా, వాతావరణ పరిస్థితులు, పంట దశలు, ఫీల్డ్ సెన్సార్ డేటాను విశ్లేషించి తెగుళ్లు, కీటక దాడుల ప్రమాదాన్ని ముందుగా అంచనా వేయగలవు. గుర్తించిన ప్రాంతాలకు మాత్రమే సరైన క్రిమి సంహారకాలను పిచికారీ చేయడానికి కృత్రిమ మేధస్సు డ్రోన్లు, స్మార్ట్ స్ప్రేయర్లను ఉపయోగించవచ్చు. అలాగే రైతులు మార్కెట్ వ్యూహాలు, నిల్వ నిర్వహణ రూపకల్పనలో సహాయపడుతుంది. మార్కెట్ ధోరణి, గిరాకీ, సరఫరా సమాచారం, రవాణా ఖర్చులు, గత ధరలను విశ్లేషణ చేసి భవిష్యత్ ధరలను అంచనా వేయగలదు. ఇది రైతులు తమ ఉత్పత్తులను సరైన సమయంలో, మంచి ధరకు అమ్ముకోవడానికి సహాయపడుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థను మెరుగు పరచి నష్టాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా పంట పండిన తర్వాత దాని నాణ్యతను స్వయంచాలకంగా పరిశీలించి వర్గీకరిస్తుంది. గిరాకీ ఆధారంగా, అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా పంటల సాగుచేయటానికి, నాణ్యతా ప్రమాణాలను పాటించి ఎగుమతులను పెంచుకోవడానికి కూడా కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుంది. అలాగే వాతావరణ డేటాను విశ్లేషించి, వాతావరణ పరిస్థితులను కచ్చితంగా అంచనా వేస్తుంది. కరువు, వరదలు, తుపానులు వంటి విపత్తుల ప్రమాదాన్ని ముందస్తుగా అంచనా వేసి రైతులు నష్టాన్ని తగ్గించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవడానికి సహాయపడుతుంది.

● రోబోటిక్స్, యంత్రీకరణ

కృత్రిమ మేధస్సు ఆధారిత రోబోట్లు పండ్లు, కూరగాయలు వంటి పంటలను పక్వత ఆధారంగా గుర్తించి స్వయంచాలకంగా కోయ గలవు. ఇది కూలీల కొరతను అధిగమించడంలో సహాయపడుతుంది. కంప్యూటర్ విజన్‌తో పనిచేసే రోబోట్లు పంట మొక్కలను నాశనం చేయకుండా కలుపు మొక్కలను మాత్రమే గుర్తించి తొలగిస్తాయి, వాటి ఉధృతిని బట్టి కలుపు నియంత్రణ మందులను పిచికారి చేస్తాయి.

● ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

భారతదేశంలో, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతుల కోసం, ప్రభుత్వం కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవసాయ పథకాలను అందిస్తోంది. అయితే చిన్న రైతులకు కృత్రిమ మేధస్సు సాంకేతికతల గురించి అవగాహన కల్పించడం, శిక్షణ ఇవ్వడం, వారికి ఈ సాంకేతికత అందుబాటులో ఉండేలా చూడటం, ఖర్చును తగ్గించడం, సులభంగా వాడే పరిష్కారాలు అభివృద్ధి చేయడం అవసరం. విశ్వసనీయమైన డేటా సేకరణ, పంపిణీ ముఖ్యం. గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్నెట్ అనుసంధానం, విద్యుత్ సరఫరా మెరుగుపరచాలని పీవీ సత్యనారాయణ సూచించారు.

మిర్చియార్డులో భారీఎత్తున అభివృద్ధి పనులు

● రూ. 3.20 కోట్లతో మార్కెటింగ్ శాఖకు ప్రతిపాదన

● రాబోయే సీజన్‌లోపు పూర్తి చేయాలని లక్ష్యం

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే ఖ్యాతి గాంచిన మిర్చియార్డులో రైతులు, వ్యాపారస్థులు, హమాలీల సౌకర్యార్థం భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించింది. మరో రెండు, మూడు నెలల్లో మిర్చి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పది పనుల అంచ నాలను మార్కెటింగ్‌శాఖ అధికారులు కమిష నర్‌కు నివేదించారు. ఇటీవలి కాలంలో ఎప్పుడూ లేని విధంగా దాదాపుగా రూ. 3.20 కోట్ల పనులను చేపట్టబోతున్నారు. వీటికి పరిపాలన అనుమతి రాగానే సాంకేతిక అనుమతులు తీసుకొని సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టి పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు.

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో మిర్చియార్డులో పెద్దగా అభివృద్ధి పనులు జరగలేదు. దీంతో డ్రైనేజీ సమస్యలు పెరిగిపోయాయి. పైపులైన్ల లీకులు వంటివి తరచుగా జరుగుతున్నాయి. టాయ్‌లెట్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. రైతులు విశ్రాంతి తీసుకొనే రెస్టుహౌస్ లోనూ సరిగా సదుపాయాలు ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే ప్రతిస్పందించేందుకు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులో లేదు. వీటన్నింటికి సంబం ధించి మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చేత అధ్యయనం చేయించి ప్రతిపా దనలు సిద్ధం చేయించారు.



మిర్చియార్డు

ప్రతిపాదనలు ఇలా...

- రూ. 33 లక్షలతో ర్యాంపులను సరి చేయడం, కల్వర్టులపై మ్యాన్ హోల్స్ ఏర్పాటు, 2, 3 గేట్ల వద్ద బెల్‌మౌత్‌ల ఏర్పాటుకు ప్రతిపాదన.
- ప్రస్తుతం ఉన్న డ్రెయిన్లపై ప్రీకాస్టు బ్లాకుల ఏర్పాటుకు రూ 28 లక్షలతో పనుల ప్రతిపాదన.
- రూ. 22.50 లక్షలతో సూపర్‌వైజర్ల హాల్‌లో వర్కుస్టేషన్ల ఏర్పాటు.
- పాత మిర్చియార్డులో ఉన్న అతిథిగృహం మరమ్మతులనురూ.21 లక్షలతో ప్రతిపాదన.
- వేస్టువాటర్ పైపులైనుని అన్ని టాయ్‌లెట్స్, యూరినల్ బ్లాకులకు విస్తరించేందుకు రూ. 37 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా.
- ఫైర్ ఫైటింగ్ పరికరాల రిపేర్లు, గ్రిల్స్ ఎత్తు పెంచడం, రెండు మోటార్లను లింకు చేసేందుకు రూ.20లక్షలతో పనులకు ప్రతిపాదన.
- 6, 7 గేట్ల వద్ద సీసీ డ్రెయిన్ల విస్తరణ, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ. 29.80 లక్షలతో ప్రతిపాదన.
- రైతు విశ్రాంతి గది నుంచి ఉచిత భోజన శాల వరకు ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 14.50 లక్షల ఖర్చవుతుందని అంచనా.
- వాటర్ ట్యాంకు ఏరియా చదును చేయడం, జనరేటర్ రూం వద్ద పార్కింగ్ టైల్స్ ఏర్పాటుకు రూ. 12.30 లక్షలతో పనులకు ప్రతిపాదన.
- టీటీపీసీ భవనం రిపేర్లు, నిర్వహణకు రూ. 1.02 కోట్ల ఖర్చవుతుందని అంచనా.

రైతు ప్రయోజనాల కోసమే పనుల ప్రతిపాదన

● చంద్రిక, జీఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి



మిర్చి సీజన్ డిసెంబరు నెలాఖరు నుంచి ప్రారంభమవుతుంది. అప్పుడు నిత్యం వేల సంఖ్యలో రైతులు మిర్చియార్డుకు వచ్చే అవకాశం ఉన్నందున వారి ప్రయోజనాల కోసమే మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రతిపాదించాం. మిర్చియార్డుకు వచ్చిన రైతు ఎక్కడా అసౌకర్యానికి గురి కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే సీఎం ఆదేశాల మేరకు అనేక పనులు చేపట్టాం. ఈ-పోస్ యంత్రాల ద్వారా మిర్చి టిక్కీల కాటాలు పకడ్బందీగా జరిగేలా చూస్తున్నాం. ప్రతిపాదన పనులు పూర్తయితే మౌలిక సదుపాయాలకు ఎక్కడా ఇబ్బంది తలెత్తదు.

రిజర్వుడు బోగీల్లోకి జనరల్ టిక్కెట్ ప్రయాణికులు

● టార్గెట్ల కోసం ఫైన్లు రాస్తున్న టీసీలు ● ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని ఆర్‌పీఎఫ్ సిబ్బంది ● ఇబ్బందులు పడుతున్న కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్యాసింజర్లు

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గతంలో రిజర్వేషన్ టిక్కెట్ లేకుండా రైళ్లలోని రిజర్వుడు బోగీలలోకి కాలు మోపే పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడు జనరల్ టిక్కెట్‌తోనే కాకుండా అసలు ఎలాంటి టిక్కెట్ లేకుండానే స్లీపర్‌క్లాస్ బోగీలలోకి కొందరు ప్రయాణికులు ఎక్కేస్తున్నారు. వీళ్ల వల్ల మహిళలు బిక్కుబిక్కుమంటూ రాత్రంతా నిద్రకు దూరమై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక టాయ్‌లెట్స్ వద్దకు కూడా వెళ్లలేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్లీపర్‌క్లాస్ బెర్తుల మధ్యన అన్ రిజర్వుడు ప్రయాణికులు చేరి కూర్చోవడం, నిద్రపోవడం వంటివి చేస్తుండటంతో బెర్తులలో ఉన్న కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పండగల రద్దీ రోజుల్లో అయితే కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్‌లు ఉన్న ప్రయాణికులు కనీసం వాళ్ల సీట్లలో కూడా కూర్చోలేని పరిస్థితి రైళ్లలో తలెత్తుతోంది. ఈ పరిస్థితిపై ఆన్‌బోర్డు టీసీలకు ప్రయాణికులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. మరోవైపు ఆర్‌పీఎఫ్ గార్డులు కూడా చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో ముఖ్యంగా స్లీపర్‌క్లాస్ ప్రయాణం ఇటీవలి కాలంలో ప్రయాణికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. ఈ క్రమంలో అక్కడి నుంచి వెళ్లిపోవాలని ప్రయాణికులు ఎవరైనా కోరితే అందుకు ఎదురు సమాధానాలు చెబుతూ గొడవలకు దిగుతున్నారు. రైల్వే శాఖ ఈ పరిస్థితిని నిలువరించకపోతే భవిష్యత్తులో రైలు ప్రయాణమంటేనే మహిళలు భయపడిపోయే పరిస్థితి నెలకొంటుంది.

రైల్వే చట్టం ప్రకారం కన్‌ఫర్మ్‌డ్, పార్షియల్ కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్రయాణికులను మాత్రమే రిజర్వుడు బోగీలలోకి అనుమతించాలి. ఏవైనా బెర్తులు ఖాళీ ఉన్నప్పుడు మాత్రమే జనరల్ టిక్కెట్ ప్రయాణికులకు ఫైన్ చెల్లించుకొని బెర్తు నంబరు కేటాయించాలి. ఆ ప్రయాణికుడి పూర్తి వివరాలు కూడా నమోదు చేసుకోవాలి. ఈ నిబంధనలను ఆన్‌బోర్డు టీసీలు పాటించడం లేదు. కేవలం తమకు కేటాయించిన ఫైన్‌ల లక్ష్యాన్ని అధిగమించేందుకు జనరల్ టిక్కెట్‌తో లేదా టిక్కెట్ లేకపోయినా సరే ఫైన్ రాసేసి ఇష్టం వచ్చినచోట కూర్చోమని అనుమతిస్తున్నారు. ఇలా చేయడాన్ని ఆర్‌పీఎఫ్ సిబ్బంది నిరోధించాలి. వాళ్లు కూడా చేతులు కట్టుకోవటంతో ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల దసరా పండగ సమయంలో గుంటూరు మీదుగా ప్రయాణించిన అన్ని ఎక్స్‌ప్రెస్/సూపర్‌ఫాస్టు రైళ్లలో ప్రయాణికులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తరాది, పశ్చిమ రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉందని ప్రయాణికులు తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అమృత్ సంవాద్ పేరుతో రైల్వే అధికారులు ప్రయాణికుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. అయితే వాటిని ఆచరణలో పెడతారా, లేదా అన్నదే అనుమానంగా మారింది.

కలవరపెడుతున్న టూరెట్ సిండ్రోమ్..!

● చిన్న పిల్లలను వేధిస్తున్న వింత వ్యాధి
● కొవిడ్ తర్వాత పెరుగుతున్న బాధితులు
● బిహేవియర్ థెరపీతో పరిష్కార మార్గాలు


గుంటూరు మెడికల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలు కన్ను గీటడం, ముక్కు ఎగబీల్చడం, గొంతు సవరించుకోవడం, అశ్లీల పదాలు వాడటం మామూలే. ఈ లక్షణాల సమూహారాన్ని సాధారణంగా టూరెట్ సిండ్రోమ్ అంటారు. పైన పేర్కొన్న లక్షణాలు సాధారణ లక్షణాలుగానే కనిపిస్తాయి. అయితే ఇవి సింగిల్ టిక్స్ (ఒకరిలో ఒకే లక్షణం)గా ఉంటే వింత అనిపించదు. కాని మల్టిపుల్ టిక్స్ (అన్నీ ఒకరి లోనే కనిపిస్తే) ఉన్నవారిలో మాత్రం టూలెట్ సిండ్రోమ్ పెద్ద సమస్యగా మారుతుంది. ఈ వ్యాధి ఉన్న వారికి సామాజికంగా వివక్ష ఎదుర వుతుంది. గుంటూరు నగరంలో న్యూరాలజిస్టుల దగ్గరకు ఇటీవల పెద్ద సంఖ్యలో టూరెట్ బాధిత చిన్నారులు చికిత్సకు వస్తున్నారు.

చిన్న పిల్లల్లో కనిపించే వ్యాధి

టూరెట్ సిండ్రోమ్ సాధారంగా చిన్నపిల్లల్లో కనిపిస్తుంది. వ్యాధిగ్రస్థుల్లో 80 శాతం మంది మగ పిల్లలే ఉంటారు. టూరెట్ జన్యు వ్యాధి. మెదడులోని బేసల్ గ్యాంగ్లియా, థలామస్, కార్టెక్స్ మధ్య న్యూరో నెట్‌వర్క్ సమన్వయం కొరవడటం వల్ల సంక్రమిస్తుంది. కొవిడ్-19 త ర్వాత టూరెట్ సిండ్రోమ్ కేసులు పెరుగు తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. పిల్లల్లో వ్యాధిని సకాలంలో గుర్తించడం ముఖ్యం. తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఇదొక ప్రవర్తనాపరమైన సమస్య గా భావిస్తున్నారు తప్పితే టూరెట్ సిండ్రోమ్‌గా గుర్తించలేకపోతున్నారు. ఇది తర్వాత పలు సమస్యలకు దారి తీస్తోంది.

మల్టీపుల్ టిక్స్‌తో ఇబ్బందులు

టూరెట్ సిండ్రోమ్ బారిన పడ్డ పిల్లలు పదే పదే నోటితో



శబ్దాలు చేయడం, కన్ను కొట్టడం, గొంతు సవరించుకోవడం, అశ్లీల పదాలు ఉచ్చరించడం వంటివి చేస్తారు. వీటిని టిక్స్‌గా పిలుస్తారు. మల్టీపుల్ టిక్స్‌తో పిల్లలకు ఇబ్బం దులు ఎదురవుతాయి. కొందరిలో ఇవి స్వల్పంగా ఉంటే మరి కొందరిలో తీవ్రంగా ఉంటాయి. ఈ లక్షణాలు తరచూ కనిపిస్తుంటాయి. ఇలాంటి వారి పట్ల బడిలో, బయట వివక్ష కనిపిస్తుంది. చదు వులోనూ వెనుకబడతారు. టూరెట్ రోగులకు ప్రత్యేక వైద్యం అంటూ ఏమీ లేదు. లక్షణాలు తగ్గించేందుకు మందులు వాడతారు. కొందరిలో టూరెట్ లక్షణాలతో పాటు ఏడీహెచ్‌డీ, ఓసీడీ వంటి లక్షణాలు కలసి ఉంటాయి.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే కీలక పాత్ర

● న్యూరాలజిస్ట్ డాక్టర్ ఘంటా శ్రీనివాస్

టూరెట్ బాధిత చిన్నారుల చికిత్సల్లో వైద్యుల కన్నా.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాత్ర కీలకమని న్యూరాలజిస్ట్ డాక్టర్ ఘంటా శ్రీనివాస్ తెలిపారు. టిక్స్‌తో బాధపడే పిల్లల పట్ల వివక్ష చూపకుండా ఓర్పుగా వ్యవహరించి వారి పట్ల ఆదరణ చూపాలన్నారు. వీరి పట్ల టీచర్లు, తల్లిదండ్రులు కోప్పడితే... వారు మరింత ఆందోళన చెంది లక్షణాల తీవ్రత పెరుగుతుందన్నారు. ఇలాంటి వారికి కాగ్నేటివ్ బిహేవియర్ థెరపీ, కౌన్సెలింగ్ వల్ల కొంత ఉపయోగం ఉంటుందన్నారు.



రెగ్యులేటరీ సంస్థల సలహాలతో ఆర్థిక మోసాల కట్టడి

● ఏఎన్‌యూ రెక్టార్ శివరాం ప్రసాద్

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలను అడ్డుకునేందుకు రెగ్యులేటరీ సంస్థల సలహాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆర్ శివరాం ప్రసాద్ అన్నారు. సోమవారం ధర్మపీఠం లీగల్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అభిజ్ఞ భారత్ ఆర్గనైజేషన్, హిందూ కాలేజ్ ఆఫ్ మేనేజ్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో హిందూ కళాశాలలో సెక్యూర్డ్ ఫైనాన్షియల్ ప్లానింగ్ అండ్ ఫ్రాడ్ ప్రివెన్షన్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హిందూ కాలేజ్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో రెక్టార్ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ, తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనుకునేవారు, అధిక ఆత్మవిశ్వాసంతో కొందరు ఆర్థిక నష్టాలను చవిచూస్తారని అన్నారు. ఆర్థిక మోసాలను అడ్డుకునేందుకు రెగ్యులేటరీ సంస్థల సలహాలు తీసుకోవాలని సూచించారు. అభిజ్ఞ భారత్ ఆర్గనైజేషన్ ఫౌండింగ్ ఛైర్మన్ డాక్టర్ దుంప శ్రీదేవి మాట్లాడుతూ, సెబీ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధులు విద్యార్థుల చెంతకు వచ్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ధర్మపీఠం లీగల్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, మోసాల బారిన పడి కొందరు చిన్న వయసులోనే ఆత్మహత్యలు చేసుకుంటున్న ఉదంతాలు చూస్తున్నామని చెప్పారు. సెబీ సౌత్ ఇండియా జనరల్ మేనేజర్ ఎంకే శ్రీకాంత్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గుంటూరు రవి రాజా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు పెట్టుబడి సంస్థలలో మోసాలకు గురికాకుండా ఎలా ఉండాలో సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ చెరువు రామకృష్ణ మూర్తి, శెట్టిపల్లి శశికిరణ్, సంపతి సంతోష్ కుమార్, యర్రం శెట్టి శ్రీనివాసరావు, కుమారి తాళ్లూరి ప్రహర్షిత, కళాశాల విభాగాధిపతి అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ వి చక్రవర్తి, ప్రొఫెసర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. కల్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వైష్ణవి, వేదవతి, బాజీ బాబు, అభిలాష్ రెడ్డి, షబానా, అనిత, వెంకట కల్యాణ్, రాజేశ్వరి దేవి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రెక్టార్ శివరాం ప్రసాద్

అమరావతిలో ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం పర్యటన

తుళ్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) బృందం సోమవారం రాజధాని అమరావతి పర్యటనకు విచ్చేసింది. ఏడీబీ - వాటర్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో (సీనియర్ డైరక్టర్), మనోజ్ శర్మ (డైరెక్టర్), సంజయ్ జోషి (ప్రిన్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్ (సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్) తొలుత విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చారు. ఏడీబీ బృందానికి సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, అమిలినేని భార్గవ్‌తేజ్ స్వాగతం పలికా రు. అనంతరం సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)లోని ముఖ్య అధికారులతో బ్యాంకు బృందం సమావేశం కాగా రాజధాని అమరావతి నిర్మాణ పురోగతిని కమిషనర్ వివరించారు. అనంతరం బ్యాంకు బృందం మందడంలోని సీఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కా ర్యాలయం, శాఖమూరు రిజర్వాయర్, నిర్మాణం పూర్తి చేసుకొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాల సముదాయాలు ఇతర భవనాలను పరిశీలించింది. ఆయా సైట్లలో సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. మందడంలో అమలుచేస్తున్న గ్రీవెన్స్ రిడ్రస్సల్ మెకానిజం (జీఆర్‌ఎం) గురించి అధికారులు బ్యాంకు బృందానికి వివరించారు. అర్జీల పరిష్కారంలో అమలవుతున్న జీఆర్‌ఎం విధానం పై బ్యాంకు బృందంలోని సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శాఖమూరు రిజర్వాయర్ వద్ద ఏడీసీఎల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ (పీఎంసీ), గుత్తేదారులతో బ్యాంకు బృందంలోని సభ్యులు కలిశారు.



అమరావతిలో పర్యటించిన ఆసియా అభివృద్ధి బ్యాంకు సభ్యులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

తాడికొండలో భారీ వర్షం

తాడికొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తాడికొండలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఉదయం అంతా ఎండ తీవ్రతకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం రాత్రి భారీగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలబడింది. కాలువలు వర్షపు నీటితో పారాయి. ఈ సంవత్సరం అధిక వర్షాల వలన పంట నష్టం ఎక్కువగా జరుగుతుందని రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరి, పత్తి, మినుము, జూట్, పెసలు తదితర పంటలను రైతులు సాగుచేశారు. అధిక వర్షాలకు పంటలు పూర్తిగాపాడైపోతున్నాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

తాడికొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మోతడక గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ మండలం మోతడక గ్రామానికి చెందిన కొమ్మినేని సాంబశివరావు(67) రోడ్డు దాటుతున్న క్రమంలో అమరావతి నుంచి గుంటూరు వైపుకు ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో కొమ్మినేని సాంబశివరావును స్థానికులు 108 ద్వారా చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అయితే దారిలో వృద్ధుడు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమవారం మృతుని కుమారుడు కొమ్మినేని హరికృష్ణ తాడికొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.

అనంతవరం గోశాలకు అనుమతులు లేవు: తహసీల్దార్

తుళ్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనంతవరం గ్రామంలో సీఆర్డీఏకి చెందిన రెండు ఎకరాలలో తోట సురేష్ ఏర్పాటు చేసిన గోశాలకు ఎటువంటి అనుమతులు లేవని పశు సంవర్ధశాఖ అధికారులు, తుళ్లూరు మండల తహసీల్దార్ హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు గో ప్రాంగణాన్ని పరిశీలించారు. గో శాలలో సుమారు 360 గోవులు ఉన్నాయని వాటికి సరైన వసతి, సదుపాయాలు లేవని తెలిపారు. అందువల్ల గోవులను రెండు రోజులో సురక్షితమైన ప్రదేశంలో వుంచి సంరక్షించాలని నిర్వాహకుడు తోట సురేష్‌కు అధికారులు నోటీసులు జారీ చేశారు.

విజయవాడలో జరిగే సమ్మెకు హాజరుకండి

● కాకర్ల వెంకటరామిరెడ్డి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో మంగళవారం జరిగే సమ్మెకు అన్ని ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు హాజరు కావాలని ఏపి గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తాడేపల్లిలోని ఏపీజీఈఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులందరూ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉద్యోగులకు అనేక ఎన్నికల హామీలు ఇచ్చిందని, ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు.

నేడు హుండీల లెక్కింపు

మంగళగిరి సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కానుకల హుండీలను మంగళవారం ఉదయం లెక్కించనున్నట్టు కార్యనిర్వహణాధికారి కే.సునీల్‌కుమార్ తెలిపారు. ఎగువ, దిగువ సన్నిధులతోపాటు ఉపాలయాల్లోని హుండీలను ఉదయం 8 గంటల నుంచి లెక్కించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన భక్తులు, భక్త బృందం ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మంత్రి లోకేశ్ ఇచ్చిన వాగ్దానం నెరవేర్చాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ

తాడేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గంలోని ప్రచార సభల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికి రైల్వే, కొండ పోరంబోకు, ఇరిగేషన్ తదితర ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు, ఇంటి స్థలం లేని వారికి రెండు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం, ప్రస్తుతం పేదలు నివాసం ఉంటున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఉండవల్లి గుంటూరు ఛానల్ హెడ్ రెగ్యులేటర్ దగ్గర మంత్రి నారా లోకేశ్ సీతానగరంలో పాదయాత్ర సందర్భంగా అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని వేసిన శిలాఫలకం ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. మరోపక్క తాడేపల్లి సెంటర్‌లో పోతురాజు స్వామి గుడి, రన్నింగ్ రూమ్ సెంటర్, వెంకయ్య కొట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో సీపీఎం కార్యకర్తలు పాదయాత్ర చేస్తూ ఆ ప్రాంతంలోని పేదలందరికి దరఖాస్తులు పంపిణీ చేశారు. ఈ నెల 17వ తేదీన మంగళగిరిలోని ఎంటిఎంసి కార్యాలయం వద్దకు దరఖాస్తులతో రావాలని పేదలకు పిలుపునిచ్చారు.

ఎన్టీఆర్ కాలనీలో రోడ్లు, కాల్వలు నిర్మించాలని వినతి

దుగ్గిరాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని ఎన్టీఆర్ కాలనీలో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఎన్టీఆర్ కాలనీవాసులుల వినతి పత్రం అందించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కాలనీ వాసులు ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఇంకా కాలనీలోని ఇబ్బందులను ఎంపీడీవో శ్రీనివాసరావుకు వివరించారు. కాలనీవాసులతోపాటు, సీపీఎం నాయకులు ఈమని అప్పారావు, గొర్రిపాటి శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా చిలువూరు-కేఆర్‌కొండూరు రోడ్డు

● దుర్గంధంతో ముక్కుమూసుకు వెళ్లాల్సిన దుస్థితి

● ఇక్కట్లుపడుతున్న మహంకాళీ ఆలయానికి వెళ్లే భక్తులు

దుగ్గిరాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి). మండల గ్రామం కేఆర్‌కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులు, రోడ్డుపక్కనే భారీగా వేస్తున్న చెత్త, వ్యర్థాల కంపుతో ఇబ్బందులు పడుడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి నిర్మాణానికి నోచుకోక గుంతలమయమై, అధ్వానంగా మారిన రోడ్డుకు ఎట్టకేలకు మంత్రి నారా లోకేశ్ చొరవతో మోక్షం లభించింది. ఇటీవలే కోట్లాది రూపాయలతో రోడ్డు నిర్మించడంతో భక్తులు నిశ్చింతగా ఆలయానికి వెళుతున్నారు. కాగా ఆదివారాల్లో అమ్మవారి దర్శనం కోసం వచ్చే వేలాదిమంది భక్తులు ఆ గ్రామ శివారులో దుర్గంధంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు కోతుల బెడదతో భయం, భయంగా ప్రయాణించే భక్తులకు శ్రీమహంకాళీ అమ్మవారి రోడ్డుపక్కన దర్శనమిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు మరింత ఇబ్బందికరంగా మారాయి. అధికారులు స్పందించి చెత్తను తొలగించి, భవిష్యత్తులో రోడ్డుపక్కన చెత్తవేయకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు, గ్రామస్థులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



చిలువూరు-కేఆర్‌కొండూరు మధ్య శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డులో అధ్వానంగా ఉన్న చెత్తకుప్పలు

జీఎస్టీ 2.0తో అన్ని వర్గాలకు మేలు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

వట్టిచెరుకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జీఎస్టీ 2.0తో రైతాంగంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో చేయూత, సహకారం లభిస్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామంలోని కల్యాణ మండపంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ - 6 పథకాలు, అలాగే కేంద్రంలోని కూటమి ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీతో రైతాంగంతో పాటు అన్నివర్గాలకు ఎలా మేలు జరిగిందనే అంశంపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై సూపర్ - 6, జీఎస్టీ వల్ల కలిగిన ప్రయోజనాలను వివరించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన హామీల్లో భాగంగా రైతులకు భరోసా నగదు, వంట గ్యాస్ సిలిండర్లు, వివిధ రకాల పింఛన్ల నగదు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చిన్నారుల కోసం తల్లుల ఖాతాల్లో నగదు జమ వంటి పథకాలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ నాయకులకు ఘనత దక్కుతుందన్నారు. ఇటీవల కేంద్రంలోని కూటమి ప్రభుత్వం జీఎస్టీ ప్రకటన రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలకు చేయూతతో పాటు కొనుగోలు చేసే వస్తువుల భారం తగ్గిందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గర్తించాలన్నారు. తొలుత టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి పుల్లడిగుంట గ్రామ వెలుపల నుంచి భారీ ర్యాలీతో జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్లకార్డులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మర్రి సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, తెలుగు యువత నేత మన్నవ గోపాలకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు యడ్లపల్లి వీరయ్య, క్లస్టర్లు జే రంగారావు, ఆరికపూడి మురళి, ఎస్సీ సెల్ నాయకులు దారా వెంకటరావు, యంపరాల కిషోర్, మన్నవ వంశీ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నరిశెట్టి నాగరాజు, గుంటుపల్లి కిరణ్, ఎం శ్రీనివాసరావు, గుంటుపల్లి సదాశివరావు, ఉప్పుటూరి చిన రాములు తదితరులు పాల్గొన్నారు. కాగా ఉప్పుటూరి చిన రాములు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడుతూ ఎమ్మెల్యే బూర్ల దుశ్శాలువాతో సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, చిన రాములును సత్కరిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

ఎంఈవో కేఎఫ్ కెనడి

పెదనందిపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీర్థిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ఎంఈవో కేఎఫ్ కెనడి అన్నారు. మండల పరిధిలోని గోగులమూడి జిల్లా పరిషత్ పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి, ఐఐటీలో సీట్లు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధికి దాతలు ఎంతో చేయూత అందిస్తున్నారన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కన్నెగంటి బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ గతంలో పాఠశాలను ప్రభుత్వం మూసివేయాలని జీవో పాస్ చేసినప్పటికీ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి బలోపేతం చేస్తామని తెలపడంతో ముఖ్యమంత్రితో పాటు, విద్యాశాఖ మంత్రితో మాట్లాడి పాఠశాలను మూసివేయకుండా కాపాడటం జరిగిందన్నారు. దాతల ఆశయాలను ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా నెరవేర్చాలన్నారు. అనంతరం దాత లావు వీరయ్య చిన్నం ఈశ్వరమ్మ, నరేంద్రలు విద్యార్థులు పఠాన్ జియాఫ్రిన్, మంగినేని పావనకీర్తి, సాహితీ ఉష, లిఖిత, అఫ్రీద్‌లకు షీల్డుతో పాటు నగదు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో ఎంఈవో 2 జాకబ్, హెచ్ఎం సరిపూడి శ్రీనివాసరావు ఎస్ఎంసీ చైర్మన్ జక్కం వెంకటేశ్వరరావు, వెలినేని వెంకట్రావు, భవన్నారాయణ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో కెనడి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గ్రామాలలో సమస్యలు పరిష్కరించండి

● తహసీల్దార్‌కు సీపీఎం నాయకుల వినతి

పెదనందిపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గామాలలో మురుగు నీరు, తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ హేనా ప్రియాకు సీపీఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మురుగు నీరు పారుదల లేక రోడ్లపై పారుతున్నాయని, కనీసం పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని దీని వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు, దొప్పలపూడి రమేష్ బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు పాల్గొన్నారు.

పిడుగు బాధిత కుటుంబాలకు సాయం చేయరూ...

గత నెలలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన వ్యవసాయ కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ హేనా ప్రియకు బాధిత కుటుంబ సభ్యులు విన్నవించుకున్నారు. సంబందిత రికార్డులను అందజేయడం జరిగిందని, ప్రభుత్వం అందించే ఆర్థికసాయం అందించాలని వారు కోరారు. దీనిపై తహసీల్దార్ ఉన్నతాధికారులకు నివేదిక పంపించడం జరుగుతుందని, నేరుగా బాధిత కుటుంబాల బ్యాంకు ఖాతాలకు జమచేయడం జరుగుతుందన్నారు.

కాకుమాను పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు

కాకుమాను, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు రెండు అర్జీలు దాఖలు అయినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. సర్వే కోసం ఒక అర్జీ, పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ పీజీఆర్ఎస్‌కు పీఆర్ ఏఈ రవీంద్రారెడ్డి, ఎంఈవో కెన్నడీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో ముగ్గురి అరెస్టు

దుగ్గిరాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల పంచాయతీ పరిధిలోని డీపీ అగ్రహారంలో ఏఈఎల్‌సీ చర్చి పాస్టర్ నియామకం విషయంలో తలెత్తిన కేసులో ముగ్గురు వ్యక్తులను దుగ్గిరాల పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గ్రామంలోని చర్చికి నూతన పాస్టర్ నియామకం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. గ్రామానికి చెందిన పాముల మోహనరావు తనపై గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో కర్రి మధు, కర్రి కిరణ్, కాగోలు బాబూరావులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యుడు రమణకు ఘన సన్మానం

మంగళగిరి సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడిగా నియమితులైన ఏవీ రమణను మంగళగిరి టీడీపీ నాయకులు సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే వివిధ కార్యక్రమాలకు కోఆర్డినేటర్‌గా వుంటూ సమర్థవంతమైన సేవలు అందిస్తున్న రమణకు శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యునిగా అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కొత్తపల్లి శ్రీనివాసరావు, శివాలయం ట్రస్టుబోర్డు సభ్యుడు సుఖమంచి గిరిబాబు, షేక్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర కార్యాలయంలో రమణను సన్మానిస్తున్న టీడీపీ నేతలు



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నేత రవి

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

● సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి డిమాండ్

మంగళగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసలుగా మార్చే పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి డిమాండ్ చేశారు. కార్మికులతో 13గంటల పని చేయించాలంటూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ సోమవారం నవులూరులో పారిశుధ్య కార్మికులు నిరసన తెలియజేశారు. రవి మాట్లాడుతూ 150 ఏళ్ల నుంచి అమలవుతున్న 8 గంటల పని విధానాన్ని ప్రభుత్వం 13 గంటలకు పెంచడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

దుగ్గిరాలకు ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు

దుగ్గిరాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినందుకు దుగ్గిరాల గ్రామ పంచాయతీకి ఉత్తమ పంచాయతీ అవార్డు లభించింది. గుంటూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, దుగ్గిరాల సర్పంచ్ కుషీబాయికి అవార్డును అందించారు. అదే విధంగా ఉత్తమ గ్రీన్‌అంబాసిడర్‌గా పోకూరి రూపకు అవార్డు అందించారు.



కలెక్టర్ నుంచి ఉత్తమ పంచాయతీ అవార్డును అందుకుంటున్న దుగ్గిరాల సర్పంచ్ కుషీబాయి

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

కాకుమాను, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాలలో మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ సోమవారం తెలిపారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఉచితంగా ఎలుకల నివారణ మందు తయారుచేసి రైతులకు వీఏఏలు పంపిణీ చేస్తారన్నారు. రైతులు పండించిన పంటలకు తీవ్ర నష్టం కలిగించే ఎలుకలను సామూహికంగా నిర్మూలించడం వలన ప్రయోజనాలు కలుగుతాయని ఏవో సుధాకర్ తెలిపారు. ఎలుకల నివారణ కోసం విషపు ఎర పంపిణీ కార్యక్రమంలో రైతులు తప్పనిసరిగా భాగస్వామ్యులు కావాలని విజ్ఞప్తి చేశారు.

సమ్మెలో పాల్గొనం: తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం నేతలు

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రకటించిన దశలవారీ నిరసన కార్యక్రమాలకు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం దూరంగా ఉంటుందని సంఘ నాయకులు తెలిపారు. తమ సభ్యులు అత్యవసర సేవల విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. జేఏసీ పిలుపు మేరకు అక్టోబర్ 6 నుంచి ప్రారంభమయ్యే ధర్నా కార్యక్రమాల్లో తమ యూనియన్ సభ్యులు పాల్గొనరని స్పష్టం చేశారు.

రాజధాని అసైన్డ్ రైతుల్లో గుబులు!

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూములిచ్చిన అసైన్డ్ రైతులకు లభించిన ఊరట ఇలా వచ్చి అలా వెళ్లిపోయినట్లయింది. రైతులకు ఇచ్చే పట్టాల్లో అసైన్డ్ పదం తొలగించాలంటూ రాష్ట్ర పురపాలక శాఖ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయడంలో నెలకొన్న గందరగోళమే అందుకు కారణంగా తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ పట్టాల్లో ఉన్న అసైన్డ్ పదం తొలగించి కొత్తగా పట్టాలిస్తారని ఆశించిన రెండున్నర వేల మందికి పైగా రైతులకు సీఆర్డీఏ కార్యాలయాల్లో అనూహ్య పరిస్థితి ఎదురవుతోంది. దీంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం 3,139 మంది అసైన్డ్ రైతులు 2,689.14 ఎకరాల భూములు ఇచ్చారు. వీరు ఇచ్చిన భూములకు సంబంధించి సీఆర్డీఏ ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల పట్టాలు సమస్యాత్మకంగా తయారయ్యాయి. రైతులకు ఇచ్చిన పట్టాల్లో వారు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావాన్ని తెలియజేస్తూ 'అసైన్డ్' అనే పదాన్ని చేర్చారు. 'అసైన్డ్' అనే పదాన్ని తొలగించాలని రైతులు కోరిన మీదట ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవో అమలు విషయంలో గందరగోళం నెలకొంది. ఈ జీవో ప్రకారం ఇప్పటి వరకూ రిటర్నబుల్ ప్లాట్ల పట్టాలు తీసుకోని వారికి ఇచ్చే కొత్త పట్టాల్లో మాత్రమే ఆ మార్పు చేస్తున్నట్లు అసైన్డ్ రైతులు చెబుతున్నారు. తమ పట్టాల మార్పుకోసం సీఆర్డీఏ కార్యాలయానికి వెళితే పాతవారికి కాదు, కొత్తవారికి మాత్రమే అని చెప్పి తిప్పి పంపిస్తున్నారని చెబుతున్నారు. అయితే ఇప్పటికే 95 శాతం మంది రైతులు పట్టాలు పొంది ఉన్నారు. వారి పట్టాల సవరణ చేయకపోతే జీవో వచ్చీ ఉపయోగం ఉండదు. దీంతో రైతుల్లో గుబులు మళ్లీ మొదలయింది.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న షేక్ రియాజ్, నేతలు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు స్థానిక నేతలు సోమవారం బాధితులకు పంపిణీ చేశారు. పాతమంగళగిరి ఎస్‌సీసీ రోడ్డుకు చెందిన కొండా శ్రీనుకు రూ.2 లక్షలు, బాపూజీనగర్‌కు చెందిన నాగెళ్ల మణికంఠకు రూ.లక్షా 20 వేల చొప్పున మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. తమకు ఎల్‌వోసీ చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేశ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, 24వ వార్డు అధ్యక్షుడు గంజి చంద్రశేఖర్, పలువురు నేతలు పాల్గొన్నారు.

చనిపోయినట్టు నమోదు చేశారు...

గుంటూరు (తూర్పు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బతికుండగానే నేను చనిపోయినట్టు అధికారులు రికార్డులలో నమోదు చేశారని అడవి తక్కెళ్ళపాడు, రాయపాటి శ్రీనివాస్ కాలనీ, రాజీవ్ గృహకల్పన అపార్టమెంట్‌కు చెందిన మేకల లక్ష్మీ సాయి శైలజ కలెక్టర్ వద్ద వాపోయారు. గత నెల రేషన్ సరుకుల కోసం వెళితే మీరు చనిపోయినట్టుగా రికార్డులలో ఉందని, దీంతో రేషన్ కార్డులో మీ పేరు తొలగించామని డీలర్లు చెప్పారని తెలిపారు. దీంతో సచివాలయానికి వెళ్లినా అక్కడ సిబ్బంది పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా రేషన్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని కన్నీటి పర్యంతం అయ్యారు. రేషన్‌తో పాటు వితంతు పెన్షన్ కూడా కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. దీనిపై పౌర సరఫరాల అధికారిని సంప్రదిస్తే బతికున్నట్టుగా రికార్డులలో నమోదు చేసుకోవాలని అప్పుడే నీకు రేషన్ వస్తుందని చెబుతున్నారని తెలిపారు. ఇద్దరు చిన్న పిల్లలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని కలెక్టర్ స్పందించి తగు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన మేకల లక్ష్మీ సాయి శైలజ




సమావేశంలో పాల్గొన్న వడ్డెర యువచైతన్యం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తురకా రామారావు తదితరులు

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● వడ్డెర యువచైతన్యం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రామారావు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వడ్డెరలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర యువచైతన్యం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తురకా రామారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కుంచాల కృష్ణకిషోర్ మాట్లాడుతూ భవిష్యత్తులో రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా నిరంతరం శాంతియుత ఉద్యమాలు కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పల్లపు శ్రీను, పల్నాడు జిల్లా అధ్యక్షుడు మల్లె శ్రీనివాస్, వేముల వెంకటేష్, మీనిగ ఆంజనేయులు, వేముల పూర్ణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ గృహకల్ప వాసులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గృహకల్ప వాసులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు

మంగళగిరి సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రాజీవ్ గృహకల్ప వాసులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు డిమాండ్ చేశారు. సీపీఎం నేతల బృందం సోమవారం గృహకల్ప ప్రాంతాన్ని సందర్శించి స్థానిక సమస్యలను తెలుసుకుంది. రామారావు మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికే గృహకల్ప నివాసాలన్నీ నీళ్ల కారుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ఎన్నికల ముందు పట్టణాన్ని రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇచ్చి, ఇళ్లు కూడా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్, నేతలు చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు

చేబ్రోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పొన్నూరు నియోజకవర్గం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, చేబ్రోలు స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీదేవి మాట్లాడుతూ, ఆసక్తి కలిగిన యువతీ, యువకులు ఈ శిక్షణ కార్యక్రమంలో చేరేందుకు 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ అర్హత ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అక్టోబరు 9వ తేదీలోపు హబ్ వద్ద రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకోసం 9666545975 నంబరును సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రాజధాని మాస్టర్ ప్లాన్‌కు సూచనలివ్వండి

● పొన్నూరు కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ ప్రాంతానికి మాస్టర్ ప్లాన్ తయారు కోసం సూచనలు సలహాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు ప్రజలను సోమవారం కోరారు. ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో మాస్టర్ ప్లాన్ రూపొందించే ఆర్‌వీ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ లిమిటెడ్ హైదరాబాద్ బృందం రానున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించే సదస్సులో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ తయారు చేయుటకు ప్రజలు మేధావులు నుంచి సలహాలు సూచనలు స్వీకరించినున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ సమావేశంలో పాల్గొని రాజధాని మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంకు పట్టణ ప్రజాప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ విద్యావేత్తలు, బిల్డర్స్, స్టేక్ హోల్డర్స్, డెవలపర్స్, లైసెన్స్‌డు టెక్నికల్ పర్సన్లు తప్పనిసరిగా హాజరై సలహాలు అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



అర్జీలు తీసుకుంటున్న కమిషనర్ అప్పలనాయుడు

గ్రీవెన్స్ దరఖాస్తులు సకాలంలో పరిష్కరిస్తాం

● కమిషనర్ అప్పలనాయుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 06 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మూడో వార్డులో మురుగు కాల్వల నిర్మాణం, 32వ వార్డులో వీధి దీపాల సమస్య, ఆక్రమణల తొలగింపుపై దరఖాస్తులు అందుకున్నారు. పట్టణ సమస్యలపై మున్సిపాలిటీకి సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏడు..

సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు ఏడు దరఖాస్తులు అందించారు. రెవెన్యూ 4, పంచాయితీరాజ్, ఎడ్యుకేషన్, మున్సిపల్ సమస్యలపై ఒక్కో దరఖాస్తు వచ్చినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.



జస్టిస్ లక్ష్మణరావు విగ్రహంతో శిల్పి రవిచంద్ర

సూర్య శిల్పశాలలో జస్టిస్ లక్ష్మణరావు విగ్రహం రూపకల్పన

తెనాలి అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సూర్య శిల్పశాలలో విశ్రాంత న్యాయమూర్తి దివంగత అంబటి లక్ష్మణరావు కాంస్య విగ్రహాన్ని తయారు చేశారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఆయన అలహాబాద్ హైకోర్టులో సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం రెడ్‌క్రాస్ కార్యదర్శిగా, లోక్‌సత్తా అధ్యక్షుడిగా, ఎన్నికల సంఘం పరిశీలకుడిగా, మద్యపాన నిషేధ సంఘం అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఆయన స్వగ్రామం పొన్నూరు సమీపంలోని వెల్లలూరులో విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తయారు చేసినట్లు శిల్పులు కాటూరి రవిచంద్ర, వెంకటేశ్వరరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కిష్కిందపాలెం గ్రామానికి చెందిన మునిపల్లి రాజేష్ ఆదివారం సాయంత్రం పంట నష్టం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మనస్థాపంతో పురుగు మందు తాగినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా రాత్రి పది గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అన్ని అంశాలు పరిశీలించి అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో సోమవారం వివిధ సంస్థలు, కమ్యూనిటీ గ్రూపులు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాలు తీసుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించే బాధ్యతను సీఆర్డీయే అప్పగించిన ఆర్‌వీ ఇంజనీరింగ్ కన్సల్టింగ్ సంస్థతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలపాటి మాటాడుతూ, తెనాలి పట్టణం అన్ని రంగాల్లో చారిత్రక నేపథ్యం కలిగి ఉందని, 1960లోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాహిత్య రంగాల్లో పేరెన్నికగన్న పట్టణానికి తగినట్లుగా ప్లాన్ రూపొందించాలన్నారు. ప్రస్తుతం పట్టణాన్ని అన్ని వైపులా పరిశీలించి అనుభవం ఉన్న వారందరితో మాట్లాడి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. తెనాలి డివిజన్‌లో కీలకంగా ఉన్న పట్టణానికి ఔటర్, ఇన్నర్ రింగు రోడ్లు ఎంతో అవసరమని చెప్పారు. ఆర్‌వీ ఇంజనీరింగ్ సంస్థ పవర్ పాయింట్ ప్రజంటేషన్ పూర్తిస్థాయిలో తెనాలిని అధ్యయనం చేయలేదనే విషయం అర్థమవుతుందని, సమయం తీసుకున్నా పూర్తిగా అధ్యయనంచేసి మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయాలన్నారు. చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ అప్పలనాయుడు, ఏసీపీ శివన్నారాయణ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



మధుసూదనరావును పరామర్శిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రాత్రి పెట్రోలింగ్ పెంచండి

● మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాత్రి సమయాల్లో గ్రామాల్లో పెట్రోలింగ్‌ను పెంచి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని మంత్రి మనోహర్ ఆదేశించారు. కొల్లిపర మండల పరిధిలోని తూములూరులో ఇటీవల మోటూరు మధుసూదనరావు ఇంట్లో దొంగతనం జరిగింది. విషయం తెలుసుకున్న మంత్రి మనోహర్ సోమవారం పోలీసు అధికారులతో కలిసి వారి ఇంటికి వెళ్ళి వారికి భరోసా ఇచ్చారు. డీఎస్పీ జనార్ధనరావు, సీఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావును పిలిచి గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాలపై అజాగ్రత్త వహించ వద్దు అని, ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మనోహర్ వెంట అడపా నారాయణరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, తాతా శివయ్య, నూలు వెంకటరామయ్య తదితరులు ఉన్నారు.

హౌసింగ్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాలనీవాసుల నిరసన

కొల్లిపర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గుడిబండివారిపాలెం హౌసింగ్ కాలనీలో అంతర్గత రోడ్లు వేయకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అలానే హౌసింగ్ కాలనీలో తగిన మౌలిక వసతులు కల్పించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం గుడిబండివారిపాలెం హౌసింగ్ కాలనీ వాసులు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేయడంతో ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ స్పందించారు. వెంటనే కాలనీకి వెళ్ళి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు వెంటనే పరష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు ప్రదానం



కలెక్టర్ నుంచి స్వచ్ఛ పురపాలక సంఘం అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘానికి స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డును సొంతం చేసుకుంది. సోమవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు ఈ అవార్డును అందుకున్నారు. అలాగే స్వచ్ఛ వారియర్‌గా పారిశుధ్య కార్మికుడు వడ్డాది శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారు. బెస్ట్ స్వచ్ఛ హాస్పిటల్‌గా పొన్నూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బెస్ట్ స్వచ్ఛ స్లమ్ లెవెల్ ఫెడరేషన్‌గా అంబేద్కర్ కాలనీ మహిళా స్వయం సమాఖ్య, సిద్ధి వినాయకనగర్ మహిళా స్వయం సమైక్య ప్రతినిధులు జిల్లా కలెక్టర్ నుంచి అవార్డులు అందుకున్నారు. పొన్నూరు పురపాలక సంఘంకు స్వచ్ఛ అవార్డు దక్కటంపై పొన్నూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ములుకుదురు సమాఖ్యకు స్వచ్ఛ అవార్డు

పొన్నూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం ములుకుదురు గ్రామ సమాఖ్యకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. రాష్ట్రస్థాయిలో ములుకుదురు గ్రామంకు స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్ విభాగం క్రింద ఈ అవార్డు లభించింది. సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఏపీఎం జోయబాబు వివో అధ్యక్షురాలు విజేత ఈ అవార్డును అందుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు స్వీకరిస్తున్న ఏపీఎం జోయబాబు, విజేత

ఆదర్శంగా చేబ్రోలు పంచాయతీ

చేబ్రోలు, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం చేబ్రోలు పంచాయతీకి ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛ అవార్డు లభించింది. సోమవారం ఈ అవార్డును సర్పంచ్ వినితారాణి, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావులు కలెక్టర్ తమీమ్ అన్సారియా నుంచి స్వీకరించారు. స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా నల్లపాటి రాఘవమ్మ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వినితారాణి, కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అవార్డు ఒకరికి మాత్రమే కాకుండా, గ్రామంలోని ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబం చేసిన కృషికి లభించిన గౌరవమన్నారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల కారణంగా నీరు, ఆహారం, నేలతో పాటు తల్లి పాలలో కూడా మైక్రోప్లాస్టిక్ కనుగొంటున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ సూత్రాల అమలు, సుస్థిర పద్ధతులలో కొత్త ప్రమాణాలను నిర్దయించడం వంటి అంశాలలో పంచాయతీ విశేష కృషి చేసినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా అందజేసిన స్వచ్ఛత అవార్డు చేబ్రోలు పంచాయతీకి రావడం గర్వకారణమని వారు పేర్కొన్నారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియా నుంచి స్వచ్ఛ అవార్డు స్వీకరిస్తున్న సర్పంచ్ వినితారాణి , పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు

నందివెలుగు సర్పంచ్, ప్రధానోపాధ్యాయుడికి అవార్డులు

తెనాలి అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం నందివెలుగు సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని శివపార్వతి స్వచ్ఛాంధ్ర అవార్డులు అందుకున్నారు. సోమవారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అవార్డులు అందజేశారు. గ్రామంలో పారిశుధ్యం నిర్వహించడంతో పాటు మొక్కలు పెంచినందుకు గాను ఆయనకు ఈ అవార్డులు అందింది. అదే విధంగా హైస్కూల్‌లో పచ్చదనం పరిశుభ్రతను నిర్వహించినందుకు గాను ఈ అవార్డు అందజేశారు. వీరిని గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.



కలెక్టర్ నుంచి సత్కారం అందుకుంటున్న నందివెలుగు సర్పంచ్ పవన్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు శివపార్వతి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ శ్రీ వాస్తవ తదితరులు

అర్జీలకు స్పష్టమైన పరిష్కారం చూపాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ●పీజీఆర్ఎస్‌కు 220 అర్జీలు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీ పరిశీలించి స్పష్టమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 220 అర్జీలు అందాయి. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి గంగారాజుతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలకు పరిష్కారం చూపినప్పుడే అర్జీదారులకు సంతృప్తి కలుగుతుందని చెప్పారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతీ అర్జీని నిర్దేశిత సమయంలో పరిష్కరించాల్సిందే అన్నారు. అర్జీలకు సంబంధించి స్పష్టమైన, వాస్తవ వివరాలు మాత్రమే ఇవ్వాలని చెప్పారు. ప్రీ ఆడిట్ సక్రమంగా చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి వైద్యశాలకు తరలింపు

కొల్లూరు, అక్టోబరు 06 (ఆంధ్రజ్యోతి): గాయపడిన ఓ వ్యక్తిని స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వైద్యశాలకు తరలించారు. సోమవారం కొల్లూరులోని గాంధీనగర్ సమీపంలో కృష్ణా జిల్లా చర్లపల్లికి చెందిన ఎం.శ్రీనివాస్ అనే వ్యక్తి తలకు గాయమై రోడ్డుపై పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు, 108కు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని అంబులెన్స్ సిబ్బంది ఆ వ్యక్తికి ప్రథమ చికిత్స చేశారు. అయితే వైద్యశాలకు తరలించాలంటే క్షతగాత్రునికి సంబంధించిన సహాయకులు ఉండాలంటూ ఆ వ్యక్తిని తీసుకెళ్లేందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. గాయపడిన వ్యక్తిని ఎలా వదిలేసి వెళతారంటూ పాత్రికేయులు అంబులెన్స్ సిబ్బందిని ప్రశ్నించారు. దాంతో వారు ఉన్నతాధికారులకు విషయాన్ని వివరించి పోలీసుల సమక్షంలో క్షతగాత్రుడిని తెనాలి వైద్యశాలకు తరలించారు.

పొన్నూరు పీజీఆర్ఎస్‌కు ఐదు అర్జీలు

పొన్నూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌కు 5 ఫిర్యాదులు అందినట్లు తహశీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సంబంధిత సమస్యలపై 2, విద్యుత్ సమస్యపై 1, సబ్ రిజిస్టర్ కార్యాలయానికి 1, సర్వే కోసం 1 అర్జీ అందాయి. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్



హరిత గుంటూరుపై కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పాల్గొన్న ఇతర అధికారులు

హరిత గుంటూరు ఆవిష్కృతం కావాలి

● కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పచ్చదనంతో నింపి హరిత గుంటూరును ఆవిష్కృతం చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. వనం - మనం జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జరిగింది హరిత గుంటూరు జిల్లాలో అన్ని శాఖలు సమష్టిగా, సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా సంస్థలు, ఇతర కార్యాలయాలు, ఖాళీ స్థలాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలు, వాటిలో అధిగమించిన అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీలో మొక్కలు నాటేందుకు కార్యాచరణ సమర్పించాలన్నారు. జిల్లా అటవీ అధికారి హిమశైలజ మాట్లాడుతూ 2,443 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గుంటూరు జిల్లాలో కేవలం 47.80 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో(1.90 శాతం మేర) మాత్రమే పచ్చదనం ఉందన్నారు. మిషన్ హరిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా 2029 సంవత్సరం నాటికి 37 శాతం పచ్చదనం ఉండాలన్నారు. 2025-26 సంవత్సరంలో అన్ని శాఖల సమన్వయంతో 330 హెక్టార్లలో మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా 503 హెక్టార్లలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. 2026-27 సంవత్సరంలో 311 హెక్టార్లు, 2027-28 సంవత్సరంలో 335 హెక్టార్లు, 2028 - 29 సంవత్సరంలో 344 హెక్టార్లు, 2029 -30 సంవత్సరంలో 365 హెక్టార్లలో పచ్చదనం పెంచేందుకు లక్ష్యంగా ఉందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ పాల్గొన్నారు.

సంప్రదాయ దుస్తుల పోటీలు



సంప్రదాయ దుస్తుల పోటీలలో విజేతలకు నగదు బహుమతి అందించిన సినీ రచయిత సాయిమాధవ్ తదితరులు

తెనాలి అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి గీతా మందిరంలో శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆడపిల్లలకు సంప్రదాయ దుస్తుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉప్పులూరి శారద, నారాయణ, భారతిదేవి, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. 50 మంది చిన్నారులు హాజరు కాగా వారిలో 16 మందిని ఎంపిక చేశారు. సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ బహుమతులు అందించారు. మల్లేశ్వరరావు, రమేష్, వసుంధర పర్యవేక్షించారు. పి.జ్యోత్స్న, లక్ష్మి, వెన్నెల, కె.హస్సికరెడ్డి, జె.దైవజ్ఞ, వి.కోమలశ్రీ, టి.పరమేశ్వరిలకు రూ.3900 నగదు బహుమతిగా అందించారు. కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ పోటీలు పిల్లల్లో సంప్రదాయ పద్ధతులు గుర్తించేలా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో వీరంశెట్టి రజిని, తల్లం సావిత్రి, కర్నాట జయలక్ష్మి, కటకం అన్నపూర్ణ, నంబూరు వినతి దేవానంద్, వేమూరి విజయభాస్కర్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు తనిఖీ చేస్తున్న చైర్ పర్సన్ రాధిక, కమిషనర్ అప్పలనాయుడు

13వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనులు

తెనాలి అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ రామ అప్పలనాయుడు సోమవారం పరిశీలించారు. పట్టణంలో ఎక్కడా ఎలాంటి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పని చేయాలని సిబ్బందికి సూచించారు. పిచ్చి మొక్కలు పెరిగిన ఖాళీ ప్రదేశాలను తరచూ గుర్తించి వాటిని తొలగించాలన్నారు. వర్షాకాలంలో మురుగునీటి కాల్వల్లో వ్యర్థాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, లేకపోతే నీరు పారేందుకు ఆటంకం కలిగి రోడ్లు ముంపునకు గురవుతాయన్నారు. హెల్త్ ఆఫీసర్ మొవ్వా ఏసుబాబు, కౌన్సిలర్ కుర్రా సుజాత, డీపీవో సాంబశివరావు, ఏఈ జానీబాషా తదితరులు పాల్గొన్నారు.



చదరంగం డివిజనల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

పొన్నూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు మండల స్థాయిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను డివిజనల్ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయనున్నట్లు స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ ఎంజే విల్సన్ తెలిపారు. చదరంగం పోటీలలో తొలిరోజు చెస్ అకాడమీకి చెందిన పదిమంది విద్యార్థులు ఎంపికయ్యారు.

డ్రగ్స్‌తో ప్రమాదంలో విద్యార్థుల భవితవ్యం : ఈగల్ డీఎస్పీ

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఈగల్ టీమ్ డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. బాపట్ల పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొందుతున్న నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు.